ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
సోమవారం 12 ఆగస్టు 2024





● ఓ వైపు సీఐడీ విచారణ.. మరోవైపు 22ఏ ఫైళ్లు క్షేత్రస్థాయిలో పరిశీలన

● హడలిపోతున్న అక్రమార్కులు

ఫైల్స్ కేసులో.. బిగుసుకుంటున్న ఉచ్చు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసులో అక్రమార్కులకు ఉచ్చు బిగుసుకుంటోంది. సంఘటన జరిగి ఇప్పటికి సుమారు 20 రోజులు గడుస్తోంది.. ఈ సంఘటనపై అటు జిల్లా పోలీసులు 9 కేసులు నమోదు చేశారు. ఇరువురు ఆర్డీవోలు, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఫైళ్ల దగ్ధం వెనుక ఉన్న పలువురి సూత్రధారుల ఇళ్లపై దాడులు చేసి కీలకమైన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కేసు తీవ్రతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఫైళ్ల దగ్ధం వెనుక ఉన్న కుట్రను ఛేదించేందుకు సీఐడీకి అప్పగించింది. మరోవైపు గత మూడు, నాలుగేళ్లుగా జరిగిన 22ఏ ఫైళ్లు, డీకేటీ భూముల ఫ్రీహోల్డ్ వ్యవహారంలో ఏమైనా గోల్‌మాల్ జరిగాయా? అందుకే ఫైళ్లు కాల్చారా అనే అనుమానంతో.. స్వయంగా సబ్‌కలెక్టర్ క్షేత్రస్థాయిలో ప్రతి ఫైల్‌కు సంబంధించిన భూములను పరిశీలిస్తున్నారు. వీటివల్ల జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. వ్యూహాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ చర్యల వల్ల తమకు ఉచ్చు బిగుసుకుంటోందని అక్రమాల పాత్రధారులు, సూత్రధారులు హడలిపోతున్నారు.

పలువురిపై కేసులు

గత నెల 21న రాత్రి 11.25 గంటల సమయంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులను కొందరు కాల్చేశారు. తొలుత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందేమోనని అనుకున్నప్పటికీ.. తర్వాత అది ప్రమాదం కాదు.. ఉద్దేశ్యపూర్వకంగా చేసిందేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించడంతో పాటు.. ఈ ఫైళ్ల దగ్ధం వెనుక.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు, బినామీల హస్తం ఉందనే ఆరోపణలు రావడంతో.. సాక్షాత్తూ.. రాష్ట్ర పోలీసు బాస్ మదనపల్లెకు వచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. ఈ ఫైళ్లు కాల్చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఫైళ్ల దగ్ధం వెనుక.. ఉన్న అసలు కారణాలను ప్రాథమికంగా గుర్తించారు. అదే సమయంలో సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యర్ కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాష్ట్ర రెవెన్యూ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.పి.సిసోడియా, పలువురు రాష్ట్ర స్థాయి అధికారులు సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని పరిశీలించి.. ఇది ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రమాదం కాదు.. ఉద్దేశ్యపూర్వకంగానే ఆయిల్ పోసి మంట పెట్టారనే అభిప్రాయానికి వచ్చారు. దీంతో వెంటనే స్పందించిన జిల్లా పోలీసులు గతంలో మదనపల్లె ఆర్డీవోగా పనిచేసిన మురళి, ప్రస్తుత ఆర్డీవో హరిప్రసాద్, గౌతమ్ తేజ్‌లను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారించారు. ఈ సందర్భంగా వాళ్లు ఇచ్చిన సమాచారంతో.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించి కీలకమైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇతనితో పాటు మాజీ పోస్టల్ ఉద్యోగి కృష్ణారెడ్డి ఇంట్లో, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాష, పెద్దిరెడ్డి పీఏ శశికాంత్ తదితరుల ఇళ్లలో సోదాలు నిర్వహించి వందలాది డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో.. మదనపల్లె ఫైల్స్ వెనుక పెద్దిరెడ్డి కుటుంబం పాత్ర ఉందనే అనుమానాలను కూటమి వ్యక్తం చేస్తోంది.

అందరి వేళ్లూ.. పెద్దిరెడ్డి వైపే..

ఈ సంఘటన జరిగిప్పటి నుంచి అందరి వేళ్లూ.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి, అతని అనుచరుల వైపే చూపిస్తున్నాయి. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కుటుంబం, వాళ్ల అనుచరులు అనేక భూ ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో వందలాది ఎకరాలు ఆక్రమించేశారని పలువురు ఆరోపిస్తున్నారు. పెద్దిరెడ్డి అనుచరుల పేరుతో పలువురు తమ భూములను ఆక్రమించారని, నామమాత్రపు డబ్బు ఇచ్చి బెదిరించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని, తమ భూములకు సంబంధించిన రికార్డులు రెవెన్యూ కార్యాలయాల్లో లేకుండా చేశారని పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. సిసోడియాకు బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి.. మరికొందరిని విచారించాలని చూస్తున్నారు. పెద్దిరెడ్డి ముఖ్యఅనుచరులు మాధవరెడ్డి, జింకా చలపతి, శశికాంత్ బుల్లెట్ సురేష్, అస్లాంతో పాటు మరికొందరు పలు అక్రమాలకు పాల్పడడంతో పాటు.. 22ఏ ఫైళ్ల క్లియరెన్స్‌లో అక్రమాలకు పాల్పడ్డారని అనుమానిస్తున్నారు.


మదనపల్లె సబ్ కలెక్టరేట్‌కు నిప్పు పెట్టిన ఘనటలో పూర్తిగా కాలిపోయిన ఫైళ్లు (ఫైల్)

రంగంలోకి సీఐడీ

సంఘటన జరిగిన రోజు నుంచి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు విచారణ చేస్తున్నారు. సుమారు 10 బృందాలు ఈ కేసులో అనుమానితుల కోసం వెతుకుతున్నాయి. అప్పటికి కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించకపోయినప్పటికీ.. సీఐడీ పోలీసులు జిల్లా పోలీసులతో సమన్వయం చేసుకుంటూ.. కేసును దర్యాప్తు చేస్తూ వచ్చారు. అదుపులో ఉన్న అనుమానితులతో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయడంతో పాటు.. అనుమానితుల ఫోన్‌కాల్స్ పరిశీలించారు. ఈ ఫోన్‌కాల్స్ విచారణతో మరికొందరి ఇళ్లు, ఆఫీసులపై సోదాలు చేశారు. వందలాది డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ డాక్యుమెంట్ల పరిశీలన తర్వాత... మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాష, మాధవరెడ్డితో పాటు శశికాంత్, జింకా చలపతి తదితరులపైన కేసులు నమోదు చేశారు. ఈ కేసును పూర్తి స్థాయిలో విచారించి.. వాస్తవాలు నిగ్గు తేల్చేందుకు అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం కేసును సీఐడీకి అప్పగించింది. దీంతో కేసు విచారణ వేగం పెరిగిందనే చెప్పవచ్చు. పోలీసులకు దొరకకుండా.. పరారీలో ఉన్న మాధవరెడ్డి, శశికాంత్‌తో పాటు పలువురిని అదుపులోకి తీసుకునేందుకు సీఐడీ పోలీసులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న వారి నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.

22ఏ, ఫ్రీహోల్డ్ పై క్షేత్రస్థాయిలో పరిశీలన

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు దగ్ధం కావడానికి ప్రధానంగా 22ఏ ఫైళ్లు, డీకేటీ ఫైళ్ల ఫ్రీహోల్డ్ వ్యవహారమే ప్రధాన కారణమని దర్యాప్తు బృందాలు అనుమానిస్తున్నాయి. దర్యాప్తు సంస్థల నివేదికతో గత మూడు, నాలుగు సంవత్సరాల్లో జిల్లాలో 22ఏ జాబితా నుంచి తొలగించిన భూములు, ఫ్రీహోల్డ్ భూముల వివరాలను బయటకు తీయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో స్వయంగా మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో గతంలో జరిగిన 22ఏ, ఫ్రీహోల్డ్ భూముల రికార్డులను పరిశీలించారు. ఈ చర్యలతో తాము చేసిన అక్రమాలు బయటపడతాయేమోనని అక్రమార్కులు హడలిపోతున్నారు. ఈ సంఘటనలో ఎటువంటి తొందర పాటు చర్యలు లేకుండా.. కారకులను పట్టుకునేందుకు ప్రభుత్వం అష్టదిగ్బంధనం చేస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

రాముడికి పట్టాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు



వైభవం.. రాముడి పట్టాభిషేకం

● గరుడవాహనంపై నగరోత్సవం

వాల్మీకిపురం, ఆగస్టు 11: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా పట్టాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం సుప్రభాతసేవ మొదలు ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు వేడుకగా స్నపన తిరుమంజనం గావించారు. అనంతరం ఆలయంలోని మండపాన్ని విశేష అలంకరణలతో వేదికను తీర్చి సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, విశేష భక్తజనం నడుమ పట్టాభి రాముడికి కిరీటధారణ గావించి పట్టాభిషేక మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రికి విశేషాలంకృతుడైన పట్టాభిరాముడిని గరుడ వాహనంపై పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. హోమాది కార్యక్రమాలు ఏకాంత సేవతో ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల్లో టీటీడీ ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టర్, కృష్ణరాజు, అనిల్‌కుమార్, భాషికాచార్యులు, శ్రీరామ్‌కుమార్, రామ్‌గోపాల్, వేదపారాయణ బృందం, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


గరుడ వాహనంపై సీతారామలక్ష్మణ సమేత పట్టాభిరాముడు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

● దోమల నివారణకు ఫాగింగ్, అబేట్ ద్రావణం పిచికారీ

● ఇంటింటి ఫీవర్ సర్వే.. వైద్య శిబిరాలు ఏర్పాటు


వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

తంబళ్లపల్లె, ఆగస్టు 11: తంబళ్లపల్లెలో ఆదివారం పంచాయతీ, వైద్యశాఖ అధికారులు దోమల నివారణకు పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. తంబళ్లపల్లెలో శనివారం ఒక్కసారిగా మూడు డెంగ్యూ కేసులు వెలుగు చూశాయి. దీంతో అధికారులు దోమలను అరికట్టడంలో విఫలమయ్యారని, దీని కారణంగా దోమల వ్యాప్తి పెరిగి జ్వరాలు వస్తున్నాయని.. వెంటనే దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం వెలువడింది. ఈ కథనానికి స్పందించిన వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ అధికారులు ఆదివారం ఉదయమే తంబళ్లపల్లెకు చేరుకుని దోమల నివారణ చర్యలు ముమ్మరం చేశారు. కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి అనుపమ, మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఈవోఆర్డీ దిలీప్‌కుమార్, కార్యదర్శి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఓ హెల్త్ అసిస్టెంట్, నలుగురు ఏఎన్‌ఎంలు, 15 మంది ఆశా కార్యకర్తలు నాలుగు బృందాలుగా ఏర్పడి ఇంటింటి ఫీవర్ సర్వేతో పాటు యాంటీ లార్వా ఆపరేషన్ (ఏఎల్వో) నిర్వహించారు. ఫాగింగ్, మురుగు నీటికాలువలు, నీరు నిల్వ ఉన్న చోట, డెంగ్యూ జ్వర బాధితుల ఇళ్ల వద్ద అబేట్ ద్రావణం పిచికారీ చేశారు. తంబళ్లపల్లె రాగిమాను కూడలి వద్ద, సిద్దారెడ్డిగారిపల్లెలో వేర్వేరుగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి సుమారు 35 మందికి పరీక్షలు నిర్వహించి అవసర మైన మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇళ్ల వద్ద ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సుమలత, అమరావతి, హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణానాయక్, ఎంఎల్‌హెచ్‌పీ సిమ్రాన్, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారిపై విచారణ

కురబలకోట, ఆగస్టు 11: పేదలకు రక్షణగా నిలవాల్సిన ఓ పోలీసు అధికారి తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని పేదల భూములపై జులుం ప్రదర్శించి భూములను దోచుకోవడంపై అధికారులు విచారణ చేపట్టారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో పోలీస్ అధికారి భూదందా శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. పేదల భూములను కాజేసిన ఆ అధికారిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదికను ఇవ్వాలని రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు ఆదేశించారు. దీనిపై సంబంధిత శాఖాధికారులు విచారణ చేపట్టి అందుకు సంబంధించిన వివరాలను సేకరించారు. దీనిపై తమ శాఖాధికారులకు నివేదికను అందజేయనున్నారు.

పెళ్లిలో ప్రియురాలు హల్‌చల్

● కత్తి, యాసిడ్‌తో పెళ్లికుమారుడిపై దాడికి యత్నం

● అర్ధాంతరంగా ఆగిపోయిన వివాహం



నందలూరు, ఆగస్టు 11: కొన్ని నిమిషాల్లో నూతన జీవితంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా వధూవరులిద్దరూ ఆనందంలో మునిగిపోయి ఉన్నారు. వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వివాహ పనుల్లో నిమగ్నమైపోయారు. అతికొద్ది సమయంలోనే పెళ్లితంతు పూర్తి చేసుకొని ఎవరి దారి వారు వెళ్లిపోతారు. కానీ ఇంతలోనే ప్రియురాలు చేసిన హల్‌చల్ కారణంగా అర్ధంతరంగా వివాహం ఆగిపోయిన సంఘటన నందలూరులో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు...

నందలూరుకు చెందిన యువతితో రైల్వేకోడూరుకు చెందిన సయ్యద్‌బాషాకు మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె షాదీఖానాలో ఆదివారం ఉదయం వివాహం జరగాల్సి ఉంది. కానీ పెళ్లికుమారుడికి తిరుపతికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఉన్నట్లు ఆ మహిళ ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే ఆ మహిళ తనను కాదని వేరే యువతిని వివాహం చేసుకోవడాన్ని జీర్ణించుకోలేక షాదీఖానా వద్దకు చేసుకుని కత్తి, యాసిడ్‌తో పెళ్లికుమారుడిపై దాడికి యత్నించిందన్నారు. ఈ తోపులాటలో పెళ్లికుమారుడిపై యాసిడ్ పడకుండా పక్కన ఉన్న వారిపై పడడంతో ఒక మహిళకు తీవ్రంగా, మరో మహిళకు స్వల్పంగా గాయాలైనట్లు తెలిపారు. ఇదే సంఘటనలో ప్రియురాలు కూడా స్వల్పంగా గాయపడినట్లు చెబుతున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారని, కాగా పెళ్లికుమారుడు సయ్యద్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రియురాలిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. ఇదిలా ఉండగా వివాహం నిలిచిపోవడంతో పెళ్లికుమార్తె బంధువులు ఆవేదన చెందుతున్నారు.

జాతీయస్థాయి అవార్డుకు మదనపల్లె అంగన్‌వాడీ వర్కర్ ఎంపిక


జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైన అంగన్‌వాడి వర్కర్ జయలక్ష్మి

మదనపల్లె టౌన్, ఆగస్టు 11: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, తల్లులకు, గర్భిణులకు అందిస్తున్న ఉత్తమ సేవలకు గాను మదనపల్లె పట్టణం ఇందిరానగర్-1 అంగన్‌వాడీ సెంటర్ కార్యకర్త జయలక్ష్మి జాతీయస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. 2019 సంవత్సరంలో మదనపల్లె పర్యటనకు వచ్చిన నీతి అయోగ్ బృందం జయలక్ష్మి సేవలను కొనియాడారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న వచ్చి ప్రథమ్ టీం సైతం ఈమె పనితీరును మెచ్చుకున్నారు. అలాగే ప్రీస్కూల్ చిన్నారులను 100శాతం చేర్పడంతో పాటు, మోడల్ అంగన్‌వాడీ సెంటర్‌గా తీర్చిదిద్దడంలో జయలక్ష్మి విశేషంగా కృషి చేశారు. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ నెల 15వ తేదీన న్యూఢిల్లీలోని ఎర్రకోటలో ఉత్తమ అంగన్వాడీ కార్యకర్తగా జయలక్ష్మి జాతీయస్థాయి అవార్డు అందుకోనున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి సీడీపీవో సుజాత అంగన్‌వాడీ వర్కర్ జయలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా.. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పురస్కారానికి ఐదుగురు మాత్రమే ఎంపికయ్యారు. వీరిలో జయలక్ష్మి ఒకరు.

చేనేత రంగం కుదేలు

● ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికుల ఆత్మహత్యలు

● ఆదుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ● అయోమయంలో పిల్లల చదువులు


మూలకు చేరిన మగ్గం

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 11: చేనేత రంగం కుదేలవుతుంది. జిల్లాలో ప్రథమ ప్రాధాన్యత వ్యవసాయ రంగానికి, ద్వితీయ ప్రాధాన్యత చేనేత రంగానికి ఉంది. జిల్లాలో సుమారుగా ఇరువై వేల మందికి పైగా చేనేత మగ్గాల నిర్వహణతో జీవనం సాగిస్తున్నారు. పట్టు వ్యాపారం పట్టుతప్పి చేనేత కార్మికుల జీవనాన్ని దుర్భర స్థితిలోకి నెట్టేసింది. తద్వారా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పెద్ద దిక్కు లేక పోవడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పిల్లల చదువులకు, ఇళ్లు గడవడానికి అప్పుల మీద అప్పులు చేసి వడ్డీలు చెల్లించలేక ప్రాణాలే తీసుకొంటున్నారు. దీంతో చేనేత కార్మికుల పిల్లల చదువులు, కుటుంబ పోషణ అయోమయంలో ఉంటోంది. చేనేత రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోలేదని కార్మికులు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నేతన్నలకు వచ్చే ప్రభుత్వ సబ్సిడీలు లేకుండా చేసి ఏ కొద్దిమందికే ఇవ్వడంతో చేనేత రంగం సంక్షేమం పట్టు తప్పింది. ఇంతే కాకుండా రేషం ధరలు పెరగడం, పట్టు చీరలు ఎగుమతులు లేక వ్యాపారం సక్రమంగా జరగకపోవడంతో హోల్‌సేల్ వ్యాపారులు పట్టు చీరలు కొనుగోలు చేయడం ఆపేశారు. దీంతో కార్మికులు చేసేది లేక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత రంగాన్ని అభివృద్ధి చేస్తామని, క్లస్టర్లు ఏర్పాటు చేసి.. నేతన్నలు చేసే పనిలో నైపుణ్యాన్ని అందించడానికి శిక్షణ ఇస్తామని, పట్టు చీరలకు బ్రాండ్ ఉంటే దేశంలో ఎక్కడైనా చీరలను అమ్ముకోవచ్చని మాయమాటలతో గత ప్రభుత్వం నమ్మించింది. నేతన్నలు అనారోగ్యం పాలైతే ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడానికి హెల్త్ కార్డులు, మహాత్మాగాంధీ బుల్‌కర్ యోజన బీమా అమలు చేస్తామని తదితర హామీలు గుప్పించింది. దీంతో నమ్మిన చేనేతలు ఓట్ల రూపంలో మద్దతు పలికి సీఎంగా గెలిపించారు. కానీ ఐదేళ్లు సీఎంగా ఉన్నా ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చక పోవడంతో చేనేత రంగం తన ఉనికిని కోల్పోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత పథకాలన్నీ పక్కన పెట్టి వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం కింద సంవత్సరానికి రూ.24 వేలు ఇచ్చారు. కానీ ఇది కూడా పూర్తిస్థాయిలో చేనేత కార్మికులకు లబ్ధి అందలేదు. వేలమంది చేనేత కార్మికులుండగా వందల మందికి మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేశారు. ఇదిలా ఉండగా రేషం రేట్లు అధికంగా పెరగడంతో పట్టువ్యాపార లావాదేవీలు స్తంభించిపోయాయి. దీంతో చేనేత కార్మికులకు పనులు లేక రోడ్డున పడ్డారు. దుర్వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను, ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటున్నారు.

కార్మికుల ఆత్మహత్యలను అరికట్టాలి..

మదనపల్లెలో చేనేత రంగంలో పని చేస్తూ ఇప్పటికే 20మందికి పైగా చేనేత కార్మికుల ఆత్మహత్యలకు పాల్పడారు. ప్రభుత్వం చొరవ తీసుకుని కార్మికులకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చి ఆదుకోవాలి.

- ఓర్సు వీరభాస్కర్,
చేనేత సంఘం నాయకుడు

'చేనేత'కు సంక్షేమం కల్పించాలి..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సంక్షేమం అందించి ఈ రంగాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది. రేషంపైన సబ్సిడీలు, చేనేత కార్మికులకు బ్యాంకు ద్వారా వడ్డీ లేని రుణాలను అందివ్వాలి.

- ఎం.రామ్మోహన్, చేనేత కార్మికుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు


వ్యాపారాలు లేక ఇంట్లోనే ఉన్న పట్టుచీరలు

హార్సిలీహిల్స్‌లో సండే.. సందడి

● కొండపై హాయిగా.. చల్లగా

● అందాలను తిలకిస్తూ.. సేద తీరిన పర్యాటకులు


అటవీశాఖ ప్రాంగణంలో ఆటలాడుతున్న చిన్నారులు


మానస సరోవరంలో బోటింగ్

బికొత్తకోట, ఆగస్టు 11: ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వరుసగా రెండురోజులు సెలవు రావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక బెంగళూరు లాంటి సుదూర ప్రాంతాల నుంచి సైతం పెద్దఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. హిల్స్‌పై ఉన్న గాలిబండ, అటవీశాఖ ప్రాంగణంలోని పక్షులు, జంతువులతో పాటు, మానస సరోవరంలో బోటింగ్ చేస్తూ, ఏపీ టూరిజం రెస్టారెంట్ పరిసరాల్లో కలియ తిరుగుతూ సరదాగా గడిపారు. పాత, కొత్త వ్యూపాయింట్ల వద్ద నుంచి 4300 అడుగుల కింద కనిపిస్తూ హెలికాఫ్టర్‌లో నుంచి చూసిన అనుభూతి కలిగించే చిన్నపాటి గ్రామాలు, వ్యవసాయ పొలాలు, చెరువులను చూస్తూ సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా కనిపించారు. బెంగళూరు నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యార్థులు వారాంతంలో వందల సంఖ్యలో హిల్స్‌కు రావడం పరిపాటిగా మారింది. ఉదయం పొగమంచు, సాయంత్రం చల్లటి గాలితో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం తమను కట్టిపడేస్తోందని పలువురు పర్యాటకులు పేర్కొనడం విశేషం.


పాత వ్యూపాయింట్ వద్ద ప్రకృతి అందాలు తిలకిస్తున్న మహిళలు


హార్సిలీహిల్స్‌లోని గాలిబండపై పర్యాటకుల సందడి

జిల్లా వ్యాప్తంగా మామిడిలో ఐదేళ్లుగా నష్టాలే. రైతులపై ప్రకృతి విపత్తుల ప్రభావం తీవ్రంగా ఉంది. రెండేళ్లు కరోనా కష్టకాలంలో దిగుబడి వచ్చినా ఎగుమతులు లేక నష్టపోయారు. మరో ఏడాది అకాల వర్షాలు గాలి వానలతో తోటలో దెబ్బతిని నష్టాలు చవిచూశారు. గత ఏడాది పచ్చ పురుగులు, తెగుళ్లు అధికమై వర్షాభావ పరిస్థితుల్లో పూత రాక దిగుబడి 30 శాతానికి పడిపోయింది. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా ఈ ఏడాదీ దిగుబడి చాలా తగ్గింది. ఇలా ఐదేళ్లుగా మామిడి రైతులు నష్టపోతూనే ఉన్నారు.



మామిడి తోటల్లో పిచికారి చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

ఐదేళ్లుగా నష్టాలే..

- రెండేళ్లు కరోనా
- మరో ఏడాది అకాల వర్షాలు, గాలి, వానలు
- గత ఏడాది పురుగులు, తెగుళ్లు
- మామిడి రైతులను ఆదుకునేది ఎవరు



బంక తెగులు రావడంతో తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు (ఫైల్‌ఫొటో)

రాయచోటి (సంబేపల్లె), ఆగస్టు 11: జిల్లా వ్యాప్తంగా 31 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో సుమారు 40వేల ఎకరాల్లో మామిడి సాగులో ఉంది. నవంబర్, డిసెంబరు నెలల్లో మామిడి తోటలు పూత వస్తాయి. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో కూడా తోటలు పూత రాలేదు. వచ్చిన పూతకు తెగుళ్లు సోకడంతో మందులు కొట్టినా తగ్గలేదు. పిందె కూడా పట్ట లేదు. సస్యరక్షణ ఖర్చులు పెరిగాయే తప్ప రైతులకు మాత్రం దిగుబడులు రాలేదు. బూడిద తెగులు, బంక తెగులు, మసి తెగులు, తేనెమంచి పురుగు ఇలా ఎక్కడ చూసినా రైతుల పాలిట శాపంగా మారాయి. జల్లుపూతలతో పిందె పట్టక దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. గత ఏడాది మామిడి తోపులు కొనుగోలు చేసిన వ్యాపారులు కూడా అడ్వాన్సులు వదిలేసి తోటల వైపు కన్నెత్తి చూడలేదు.

రైతులకు సస్యరక్షణ ఖర్చులు పెరిగాయి

మామిడి రైతులకు సస్యరక్షణ ఖర్చులు పెరిగాయి. నవంబర్, డిసెంబరు నుంచి తెగుళ్ల నివారణ కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. పూతరాక మునుపు ఒకసారి పూత వచ్చిన తర్వాత, పిందె దశలో మరోసారి పిచికారి చేసేవారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల కారణంగా పొగమంచుతో మామిడిలో తెగుళ్ల వస్తున్నాయి. దీంతో కొంత మంది రైతులు నాలుగు నుంచి ఐదు సార్లు మందులు పిచికారి చేశారు. ఒక నీటి ట్యాంకర్‌కు రూ.4 వేలు ఖర్చు చేస్తున్నారు. మూడు, నాలుగు సార్లు పిచికారి చేయడంతో రైతులకు అదనపు ఖర్చులు పెరుగుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా మామిడి చెట్లలో కొంతకాలంగా జూలై, ఆగస్టులోనూ పూత వస్తోంది. వీటిని కాపాడుకుని కాస్త సైజు రాగానే ఊరగాయలకోసం అమ్మేస్తున్నారు. ప్రస్తుతం అక్కడక్కడా మామిడిచెట్లలో ఉన్న పూతను కాపాడుకునేందుకు రైతులు అగసాట్లు పడుతున్నారు. ఇది ఎంత ఎక్కువ దిగుబడి వచ్చినా కంటితుడుపు చర్యలా ఉంటుంది తప్ప పెద్ద ఆదాయం ఉండదు. మామిడి తోటలు విస్తారంగా సాగులో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



పూత సక్రమంగా రాలేదు..

నాకు మూడున్నర ఎకరాల మామిడి తోపు ఉంది. గత ఏడాది పూత సక్రమంగా రాలేదు. పూత వచ్చినా బంక తెగులుతో పిందపట్టలేదు. తెగుళ్లతో నష్టపోక తప్పడం లేదు. ఫిబ్రవరి, మార్చిలో కూడా పూత వస్తా ఉంది. ఈ పూత నిలబడదు. మామడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- నాగభూషణం, మామిడి రైతు, మాధంవాండ్లపల్లి, సంబేపల్లె మండలం



ఐదేళ్లుగా నష్టపోతూనే ఉన్నాం..

ఐదేళ్లుగా నష్టపోతూనే ఉన్నాం. రెండేళ్ల కరోనాతో నష్టపోయాం. తర్వాత అకాల వర్షాలు, గాలి, వానలతో కాయలపై బంక తెగులు వచ్చి నష్టపోయాం. రూ.35 లక్షలకు మామిడితోటలు కొన్నా. కొన్ని తోటల్లో పూత రాలేదు. కొన్న తర్వాత కొట్టిన మందుల డబ్బులు కూడా చేతికి రాలేదు.

- ఖాదర్‌వల్లి, మామిడి వ్యాపారి, సంబేపల్లె మండలం

ఘనంగా 'అలంకార చిత్రం' పుస్తకావిష్కరణ



అలంకార చిత్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11: అలంకారం వెంకటరమణరాజు రచించిన అలంకార చిత్రం గ్రంథాన్ని చిత్రసాహితీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జార్జ్‌కారోనేషన్ క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ ప్రాచీన కవులు చిత్రవిచిత్రమైన విన్యాసాలతో అలంకారాలను ప్రయోగించారన్నారు. అటువంటి చమత్కార విన్యాసాలతో కూడిన పద్యాలను, వివిధ బాషల్లోని అలంకార చిత్రాలను క్రోడీకరించి అలంకార చిత్రం పేరుతో రచయిత భావితరాలకు పుస్తకాన్ని అందించారని ఆయన కృషి అమూల్యమైనదన్నారు. పుస్తక సమీక్షకులు భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ వేల సంఖ్యలో పద్యాలను పరిశోధించి సేకరించి ఈ పుస్తకాన్ని రచించారని తెలిపారు. రచయిత డీకే చదువులబాబు మాట్లాడుతూ రచయిత పరిశోధన విలువైనదని పేర్కొన్నారు. రచయిత కొమ్మిశెట్టి మోహన్ మాట్లాడుతూ వివిధ భాషల్లోని అలంకారాన్ని సేకరించి పుస్తకాన్ని వెలువరించడం అభినందనీయమన్నారు. రచయిత అలంకారం వెంకటరమణరాజు, ఇందిర దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రచయితలు దాదాహయత్, సాయిప్రసాద్, విజయ్‌కుమార్, ఆదిత్య కుమార్, వసంతకుమార్, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పల్లేటి లక్ష్మీ కులశేఖర్‌కు జిల్లా రచయితల నివాళి

కడప (నాగరాజుపేట), ఆగస్టు 11 : తెలుగునాటక రంగ చరిత్రలో మన జిల్లాకు అఖండమైన కీర్తిని ఆర్జించి పెట్టిన వారిలో పల్లేటి లక్ష్మి కులశేఖర్ మొట్టమొదటివారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లిఖార్జునరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం కడప రాజీవ్‌కల్చరల్ క్లబ్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో పల్లేటి లక్ష్మికులశేకర్ సంస్మరణ సభ నిర్వహించారు. మొదట కులశేఖర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటకకర్తగా, నటునిగా, దర్శకునిగా, ప్రయోక్తగా పల్లేటి సాధించిన విజయాలకు ఆయనకు వందలాది సన్మానాలు జరిగాయనిఅన్నారు. రచయితల సంఘం కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైవీయూలో పల్లేటి రచనలు ఒక పరిశీలన అనే అంశంపై తాను పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకున్నానన్నారు. పరిశోధనా సమయంలో కులశేఖర్ తనకు ఎన్నో అమూల్యమైన విషయాలు చెప్పేవారని అన్నారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వ చారి మాట్లాడుతూ ఆయన రాసిన మొదటి సాంఘిక నాటకం తపస్సు సినిమాగా వచ్చిందన్నారు.

ఆర్కిటెక్చర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 11 : రాష్ట్రవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో నేషనల్ ఆర్కిటెక్చర్‌లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ విషయాన్ని సంబంధిత కన్వీనరు డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ వైస్‌చాన్సలర్ ఆదివారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్ లేదా డిప్లమా పూర్తి చేసి నాసా అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 19లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్లు, ఫీజుల చెల్లింపు ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఉంటుందన్నారు. విశాఖలోని డిపార్ట్‌మెంటు ఆఫ్ ఆర్కిటెక్చర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 44 సీట్లు, గుంటూరు ఏఎన్‌ఏయూ కాలేజీ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌లో 44 సీట్లు, భీమవరం ఎంఆర్‌కే కాలేజీలో 15 సీట్లు, తిరుపతి చదలవాడ అరుణ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో 28 సీట్లు, కడప డాక్టర్ వైఎస్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీలో 44 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్, బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 11 : స్పెషల్ ఎడ్యుకేషన్, బీఈడీ, డీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెలెన్‌కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ దౌలత్‌ఖాన్ తెలిపారు. హెలెన్‌కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ, డీఈడీ కోర్సులు నిర్వహిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అప్రూవల్‌తో నడుస్తోందన్నారు. ఇది వైవీయూ అఫిలియేషన్ పొందిందని, ఈ కోర్సులో చేరదలిచిన వారు బ్యాచ్‌లర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీలో సైన్స్, సోషల్ స్టడీస్ హ్యూమనీటిస్‌లో 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఇంజనీరింగ్, లేక టెక్నాలజీలో సైన్స్ మేథమేటిక్స్‌లో స్పెషలైజేషన్ కలిగి 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. లేదంటే దీనికి సమానమైన ఏదైనా విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సులో చేరేందుకు అర్హులని తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక..

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు11: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం సహా అన్ని డివిజన్లు, మండల ప్రజలు వారి సమస్యలను తెలియజేసేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు రావాల్సిందిగా ఒక ప్రకటనలో తెలియజేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఎర్రగుంట్ల, ఆగస్టు 11: ఎర్రగుంట్ల కడపరోడ్డులోని పొలాల్లో దేవరింటి ఎరికలమ్మ(53) శనివారం అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎల్లనూరు మండలం తిమ్మంపల్లెకు చెందిన ఈమె పులివెందుల నుంచి ప్రొద్దుటూరుకు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. సెల్‌ఫోన్‌ను బస్‌లో వదిలేసి ఎర్రగుంట్లలో దిగింది. ఆమె కుమారుడు ఇంద్రసేనారెడ్డి మధ్యాహ్నం2 గంటలకు ఫోన్‌చేస్తే బస్సు డ్రైవర్ మాట్లాడారు. ఆమె ఎక్కడ దిగింది తమకు తెలియదని చెప్పారు. దీంతో వారు ఎరికలమ్మ అదృశ్యంపై పులివెందుల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎర్రగుంట్లలో పొలాల్లో మృతదేహం ఉన్నట్లుగా ఎర్రగుంట్ల పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు ఎర్రగుంట్లకు వచ్చి మృతదేహాన్ని చేసి గుర్తు పట్టారు. కుమారుడు ఇంద్రసేనారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని, పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

సిద్దవటం, ఆగస్టు 11: పాలకొండ్రాయునిపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం ఎద్దలకొండు వెంకటసుబ్బమ్మ(42) ఫ్యానుకు చీరెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని మృతురాలు బంధువులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటసుబ్బమ్మ, ఆమె భర్త వెంకటరమణ ఇద్దరూ సొంత పొలంలో పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఆమెకు అప్పుడప్పుడూ కడుపునొప్పి వస్తుండేదని ఆదివారం విపరీతంగా కడుపునొప్పి రావడంతో నొప్పిని భరించలేక ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. భర్త వెంకటరమణ పొలం పనులు ముగించుకుని ఉదయం 10 గంటలకు వచ్చి చూడగా భార్య వెంకటసుబ్బమ్మ ఫ్యానుకు వేలాడుతూ కనిపించిందని, విషయాన్ని బంధువులకు తెలియజేశారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలు వెంకటసుబ్బమ్మ తండ్రి చిన్నవెంటకసుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలియజేశారు.



ఉరివేసుకుని మహిళ మృతి చెందడంతో విచారణ చేపట్టిన పోలీసులు

నేతన్నకు చేయూతనివ్వండి

ఎమ్మెల్యే మాధవీరెడ్డి, జేసీ అదితిసింగ్



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జేసీ

కడప (కల్చరల్), ఆగస్టు 11 : చేనేత వస్త్రాలను ధరించి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, కడప శాసనసభ్యురాలు మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం నగర పరిధిలోని శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లను వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కళాకారులను ప్రోత్సహించాలని, చేనేత వస్త్రాలను ధరించి చేనేత పరిశ్రమ వృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేతల అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలను ధరించి వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వాలన్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ చేనేతల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తాను చేనేత వస్త్రాలనే ధరిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేతలకు తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాకేశ్‌చంద్ర, చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజరావు, రాష్ట్ర పొలిట్ బ్యూరో శ్రీనివాసులరెడ్డి, చేనేత జాతీయ ఐక్యవేదిక కన్వీనరు అవ్వారు మల్లిఖార్జున, నాయకులు జేవీ రమణ, సంగటి మనోహర్, చేనేత జౌళిశాఖ అధికారులు, శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి : సీపీఐ

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 11: నియోజకవర్గంలో భూ కబ్జాదారుల నుంచి పేదల భూములను కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఖద్దర్ బాబులు పేదల భూములను కబ్జాలు చేసి దందాలు నిర్వహించి లక్షల దోచుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులను చేతుల్లో పెట్టుకుని వాగులు, వంకలు, గట్టలు, ప్రభుత్వ భూములు, ఇరిగేషన్ భూములు కబ్జాలు చేశారని ఆరోపించారు. ఇప్పుడైనా రెవెన్యూ అధికారులు స్పందించి పేదల భూములను భూ బకాసురులు నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మల రాధాకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి గంగాపూర్ తేజ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చెన్నూరు జాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కొండకల్వటాలలో ఘర్షణ.. నలుగురికి గాయాలు

జమ్మలమడుగు, ఆగస్టు 11: జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం మండలం కొండకల్వటాల గ్రామంలో ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో గ్రామంలోని ఇరువర్గాలకు చెందిన వారు ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి రాత్రి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి చెప్పిన వివరాల మేరకు గ్రామంలో టీడీపీ నేత చక్రపాణిరెడ్డి, వైసీపీ నేత తలారి మహేష్ వర్గీయులు ఘర్షణపడ్డారు. ముందురోజు అహోబిలంలో ఫంక్షన్‌కు వెళ్లి అక్కడ గొడవకు దిగినట్లు గ్రామంలో వచ్చి ఆదివారం ఒకచోట కొందరు కూర్చొని మాట్లాడుకుంటుండగా తలారీ మహేష్ వర్గీయులు గొడవకు దిగారు. ఈ ఘటనలో ఇరువర్గీయులలో వాకు చిన్నబాలసుబ్బ, వాకు మధు, చిన్నమ్మ, జి.సురేష్‌కు గాయాలయ్యాయి. ఇరువర్గీయులపై కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఆటో, ఐషర్ ఢీ.. ఒకరి మృతి

చిన్నమండెం, ఆగస్టు11: బాబూజీనగర్ కాలనీ వద్ద కడప-బెంగళూరు జాతీయ రహదారిపై ఆటోను ఐషర్ ఢీకొనడంతో గంగులయ్య(55) మృతి చెందాడు. లక్కిరెడ్డిపల్లె మండలం రెడ్డివారిపల్లె హరిజనవాడ వాసులు పడమటికోన హరిజనవాడలో వివాహం కోసం ఆటోలో వెళ్లి వస్తున్నారు. కాగా చిన్నమండెం నుంచి రాయచోటి వైపు వస్తున్న ఆటోను ఐషర్ ఢీకొంది. ఆటోలో దాదాపు 7, 8 మంది ప్రయాణిస్తుండగా వారిలో గంగులయ్య మృతి చెందగా మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారందరినీ రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు కడప రిమ్స్‌కు తరలించారు. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సింది.



మృతి చెందిన గంగులయ్య

బంగారు నగల చోరీ

కడప (క్రైం), ఆగస్టు 11: కడప నగరం రాజారెడ్డి వీధిలో బంగారు నగలు చోరీ జరిగినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. శనివారం సాయంత్రం జయన్న అనే వ్యక్తి కరెంటు బిల్లు చెల్లించేందుకు ఇంటికి తాళాలు వేసి వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా తన ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి గమనించాడు. ఇంట్లోని 46 గ్రాముల బంగారు నగలు చోరీకి గురయ్యాయని తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే చిన్నచౌకు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజ్‌కుమార్ ఇంట్లో దొంగలు పడి ఓ నల్లపూసల దండను చోరీ చేసినట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇండ్లూరు వాసి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాచూరి నరసింహారావు

పెనగలూరు, ఆగస్టు 10: నెల్లూరు జిల్లా రాపూరు మండల పరిధి రాపూరు- పెంచలకోన హైవేపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇండ్లూరు హరిజనవాడ వాసి రాచూరి నరసింహారావు(34) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల ద్వారా తెలిసిన వివరాల్లోకెళితే... నరసింహారావు అతని భార్య జీవనోపాధి కోసం ఏడాది కిందట కువైట్ వెళ్లారు. నరసింహారావు మూడు రోజుల కిందట సొంతూరుకు వచ్చారు. మూడు రోజులు బంధువులతో గడిపిన తర్వాత నెల్లూరు జిల్లా కలువాయి మండలం కొల్లూరులో తన అత్త, మామ ఇంట్లో ఉన్న కుమార్తెను చూసేందుకు మూడేళ్ల కుమారుడిని వెంటబెట్టుకుని కొల్లూరు వెళుతుండగా రాపూరు దాటుకున్న తర్వాత హైవేపై ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొంది. దీంతో నరసింహారావు తలకు తీవ్రగాయాలయ్యాయి. ఛాతి లోపల కూడా కనిపించని గాయాలు కావడం వల్ల ఆయన అక్కడే కుప్పకూలిపోయాడు. తనవెంట ఉన్న మూడేళ్ల చిన్నకుమారుడు చెయ్యి విరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు. కుప్పకూలిన నరసింహారావును స్థానికులు రాపూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా నరసింహారావు సంబంధీకులు ఎవరూ లేరని రాపూరు వైద్యులు దాదాపు రెండు గంటల వరకు చికిత్స అందివ్వక పోవడంతో మృతిచెందినట్లు సమాచారం. ఆయన మొబైల్‌లోని సమాచారంతో స్థానికులు, బంధువులకు ఫోన్‌ద్వారా తెలపడంతో ఇండ్లూరు నుంచి నరసింహారావు బంధువులు రాపూరు ప్రభుత్వాస్పత్రి చేరుకున్నారు. సంఘటనతో అటు కొల్లూరులో ఇటు ఇండ్లూరు హరిజనవాడలోను విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహానికి రాపూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిగిన తర్వాత ఇండ్లూరులోని ఇంటికి తీసుకువచ్చి దహన క్రియలు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆ నలుగురే నేతలా...?

జనసేన పార్టీలో కలకలం ● కార్యకర్తల సమావేశంలో విమర్శలు గుప్పించిన సీనియర్లు

అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్న కార్యకర్తలు




కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ నేత సాధు శివరామయ్య

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 11: జనసేన పార్టీలో కలకలం మొదలైంది. ఆ నలుగురేనా నేతలు అంటూ సామాన్య కార్యకర్తలు, సీనియర్ నేతలు ఒక్కసారిగా వేదికపై విమర్శలు గుప్పించారు. ఆదివారం రైల్వేకోడూరు సిద్ధేశ్వర కల్యాణ మండపంలో పార్టీ నియోజకవర్గ స్థాయి సామాన్య కార్యకర్తల సమావేశంలో జనసేన నియోజకవర్గ నేత సాధు శివరామయ్య మాట్లాడుతూ జరిగిన ఎన్నికల్లో రైల్వేకోడూరు జనసేన అభ్యర్థి విజయం వెనక కార్యకర్తలు, నేతలు ఉన్నారని గుర్తు చేశారు. ఏ ఒక్కరో, ఇద్దరి వల్ల పార్టీ అభ్యర్థి విజయం సాధించలేరని, పార్టీలో ఉన్న నేతలు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజల వల్ల విజయం సాధ్యమైందన్నారు. పార్టీలో సీనియర్లను పక్కన పెట్టి పబ్బం గడుపుతున్నారన్నారు. పార్టీలో ఉన్న ఆ నలుగురు నేతలనే ప్రామాణికంగా తీసుకుని రాజకీయాలు చేస్తుండడం ఆందోళనకరంగా ఉందన్నారు. పవన్‌కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను అనుగుణంగా నడుచుకుని, 12 ఏళ్లగా పార్టీలో పని చేస్తున్న సీనియర్లు, సమాన్య కార్యకర్తలను పక్కన పెట్టి రాజకీయాలు చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. జనసేన పార్టీ కోసం నిరంతరాయంగా పని చేస్తామని, అందరం పవన్‌కల్యాణ్ వెంటే ఉంటామని తెలిపారు. 12 ఏళ్లగా కేసులు, బెదిరింపులు, దాడులు చేయించుకున్నా బెదిరిపోకుండా పార్టీ కోసం నిరంతరాయంగా పని చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రచారాలను చేసి అన్ని వర్గాలను కూడగట్టుకుని పార్టీ విజయం కోసం పాటు పడ్డామని వివరించారు. సీనియర్ నేత ముద్దపోలు రామసుబ్బయ్య మాట్లాడుతూ పార్టీలో ఆ నలుగురికే ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. పార్టీ తమపై పార్టీ అధిష్టానానికి తప్పుడు సంకేతాలు ఇస్తున్నారన్నారు. కష్టపడి జెండాలు మోసి తీరా గెలిచిన తర్వాత విస్మరించడం న్యాయం కాదన్నారు. ఇటీవల జరిగిన సభ్యత్వ నమోదుకు కోడూరు, ఓబుళవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండల సీనియర్ కార్యకర్తలు, నేతలను ఆహ్వానించలేదన్నారు. ఆ నలుగురితోనే సభ్యత్వ నమోదు చేయించారని ఆందోళన వ్యక్తం చేశారు. యువనేత ముత్యాల కిషోర్ మాట్లాడుతూ పార్టీలో నేతలు వస్తుంటారు, పోతుంటారన్నారు. అయితే కార్యకర్తలే కీలకంగా పార్టీని నడిపిస్తారన్నారు. రాష్ట్ర స్థాయి, జోన్ స్థాయిలో పదవులు పొందిన నేతలు ఎవరినీ కలిపేసుకుని పోవడం లేదని ఆరోపించారు. వైసీపీ పాలనలో జనసేన నేతలపై కేసులు, దాడులు, బెదిరింపులు చేసినా భయపడకుండా పార్టీ కండువాతో అంటిపెట్టుకుని ఉన్నామని తెలిపారు. దళిత యువనేత నగిరిపాటి మహేష్ మాట్లాడుతూ నాయకుల కంటే పార్టీ ముఖ్యమని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీ కోసమే పని చేస్తున్నామని తెలిపారు. ఆ నలుగురు పార్టీలో తీరును మార్చుకోవాలని హితవు పలికారు. నియోజకవర్గంలో ప్రతి కార్యక్రమానికి హాజరయ్యే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, వారి కుటుంబ సభ్యులను ఆహ్వానించినా వారు రాకపోవడం విశేషం. యువనేత ముద్దపోలు సభాపతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ నేతలు నల్లంశెట్టి యానాదయ్య, ఉత్తరాది శివకుమార్, దాసరి వీరేంద్ర, సవరం సాయి, పగడాల మణి ప్రసాద్, చింతకాయల మణి, ఐదు మండలాల నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ ఎగుమతులు పునరుద్ధరించాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డిమాండ్

రాజంపేట టౌన్, ఆగస్టు 11: ఏపీఎండీసీ మైనింగ్ ఎగుమతులు పునరుద్ధరించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలం మంగంపేట మైనింగ్‌లో గత ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను సస్పెండ్ చేస్తూ మరోపక్క మరికొందరి ఆరోపణలపైన చర్యలు తీసుకోవడానికి మూడు నెలలుగా అన్నింటినీ నిలిపివేసి కార్మికుల కడుపు కొట్టవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి మైనింగ్ తవ్వకాలను ప్రారంభిస్తూ, ఎక్స్‌పోర్టు చేయాలన్నారు. స్థానిక అధికారులు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే ఎక్స్‌పోర్టు చేసి కార్మికులకు న్యాయం చేస్తామని అధికారులు చెబుతున్నారు. తక్షణమే అవినీతి అధికారులపైన చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు 800 మంది టిప్పర్ల డ్రైవర్లు, క్లీనర్లు పెట్రోల్ బంకులు, వెల్డింగ్‌వర్క్‌ర్స్ కిరాణ కొట్లు వారందరూ కూడా ఉపాధి లేక విలవిల్లాడుతున్నారన్నారు. వెంటనే మైనింగ్ ఎక్స్‌పోర్టుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో కార్మికులందరినీ ఐక్యం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ పి.శ్రీనివాసులు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్

రాయచోటిటౌన్, ఆగస్టు11: ప్రభుత్వం వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్ డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏఐవైఎఫ్ జరిగిన జిల్లా ప్రతినిధుల సమావేశంలో ఆయన మట్లాడుతూ గత ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయడం కోసం వలంటరీ వ్యవస్థను అమలు చేసిందన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో వలంటీర్లకు ఉద్యోగ భద్రతపై హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకునే క్రమంలో వలంటీర్లకు పూర్తి భరోసా కల్పించేలా వారికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వలంటీర్లకు బకాయి పడ్డ రెండు నెలల గౌరవ వేతనం ఇవ్వడం, ప్రభుత్వ హామీ ప్రకారం గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ వత్తిళ్లతో రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఈ నెల 10 నుంచి 15 వరకు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, నారాయణ, రాష్ట్ర ఉన్నతాధికారులకు వలంటీర్లంతా మెయిల్స్, పోస్ట్ ద్వారా సమస్యలు వినిపించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు, రాయచోటి, తంబళ్లపల్లె ప్రతినిధులు దార్ల రాజశేఖర్, పెంచలయ్య, వినయ్, చిన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



డాక్టర్ మండిపల్లె లక్ష్మిప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న మానవతా సభ్యులు

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు11: మానవత సేవలు ప్రజలకు అందించడం అభినందనీయమని మండిపల్లె ట్రస్టు చైర్మెన్ డాక్టర్ మండిపల్లె లక్ష్మిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లె నలంద హైస్కూల్‌లో మానవతా వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి అధ్యక్షతన నూతన కార్యవర్గ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాతవత సంస్థ నిరుపేదలకు ఎంతో ఉపయోపడుతోందన్నారు. రాష్ట్రంలో 115 మండలాల్లో మానవతా సేవలు అందించడం గొప్పవిషయమన్నారు. మానవత సంస్థకు 10 సెంట్లు స్థలం కేటాయించాలని సభ్యులు లక్ష్మిప్రసాద్‌రెడ్డిని కోరాగా ఈవిషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా డాక్టర్ షఫీనాయక్, కార్యదర్శిగా రామచంద్ర, రవీంద్ర, మల్‌రెడ్డి, రవిశంకర్, గోవిందు నాగరాజు, రమణ, గంగిరెడ్డి, రవి, బండపల్లె శ్రీనివాసలును ఎన్నుకున్నారు. కారక్రమంలో మానవతా సభ్యలు సెంట్రల్ కమిటీ డైరక్టర్లు గోపి, సహదేవరెడ్డి, వై ప్రసాదుయాదవ్, చైర్మెన్ బాలసుబ్రమణ్యం, శివగంగిరెడ్డి, చెన్నక్రిష్ణా, మాజీ ఎంపీటీసీ యనమల మదన్‌మోహన్, ఆరిఫుల్లా, వెంకటరామరామరాజు, పక్కీరయ్య, జయరాం, శివయ్య, సుబ్బారెడ్డి, చైతన్యరెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వరులు, విశ్వనాథ, జయచంద్రనాయుడు, లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు

సోమశిల ఎత్తిపోతల పరిశీలన

టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



సోమశిల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

ఒంటిమిట్ట, ఆగస్టు 11: శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మండల టీడీపీ నేతలతో కలిసి పరిశీలించారు. నాలుగేళ్లగా నిరుపయోగంగా ఉన్న శ్రీరామ ఎత్తిపోతల పథకం నుంచి చెరువుకు నీరు అందించాలని వినతులు వినిపించాయి. ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడంతో వెంటనే స్పందించి అవసరమయ్యే నిధులను మెయింటెనెన్స్‌కు కావాల్సిన ఏర్పాట్లు చేపట్టాలని ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్యకు ఆదేశాలు అందజేశారని జగన్‌మోహన్‌రాజు అన్నారు. ఒంటిమిట్ట చెరువు నీరులేక ఎడారిలా కనపడుతోందని కోదండరామాలయానికి వచ్చే భక్తుల అవసరాలకు నీరు లేక ట్యాంకర్ల ద్వారా సరఫరా చేపడుతున్నారని, తాగునీటికి మండలంలో తీవ్రంగా ఇబ్బంది ఉందని, శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి నింపడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. కలెక్టర్ ప్రత్యేకంగా ఒంటిమిట్ట చెరువుకు నీరు అందించేందుకు నిధులు మంజూరు చేశారని, త్వరలో పనులు చేపట్టి రైతులకు నీరు అందిస్తామన్నారు. ఎత్తిపోతల ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసేందుకు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి నిధులు కోరతామన్నారు. మండల టీడీపీ నేతలు మాజీ రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, టీడీపీ రాష్ట్ర మహిళ కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటుకు ముందే పదోన్నతులను చేపట్టాలి

ఎన్‌టీఏ రాష్ట్ర బాధ్యుడు కొండూరు శ్రీనివాసరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కొండూరు శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, ఆగస్టు11: ఉపాధ్యాయ పని సర్దుబాటుకు ముందే పదోన్నతులు చేపట్టాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర బాధ్యుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డైట్ కేంద్రంలో జరిగిన ఎన్‌టీఏ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లు గా, స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులు గా పదోన్నతులు కల్పించిన తర్వాతే సర్దుబాటు చేయడం మంచిదన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో శాశ్వత ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్ పదోన్నతులు చేపట్టాలన్నారు. జీఓ నెంబర్ 117 ప్రకారం పని సర్దు బాటు చేయడంలో చాలా లోపాలు ఉన్నాయని, దానిని సవరించిన తర్వాతే చర్యలు చేపట్టాలన్నారు. గత పాలకులు చేసిన తప్పిదాలు పునరావృతం కాకుండా ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయుల మనోవేదనకు గురి కాకుండా ఉపాధ్యాయ సంఘ నేతలతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలన్నారు. మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ సర్వీస్‌ను 62 ఏళ్లకు పెంచాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయునీలకు నైట్ డ్యూటీలు తీసివేసి వారి స్థానంలో మహిళా వార్డెన్‌లను నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ నేతలు రామాంజులు, శ్రీనివాసులు, మురళీ మోహన్‌రాజు, కులశేఖర్‌రెడ్డి, నరేంద్ర కుమార్‌రెడ్డి, ఆసిఫ్, నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 29 ప్రకారం సర్దుబాటు చేపట్టాలి

సంబేపల్లె, ఆగస్టు11: విద్యా వ్యవస్థలో సర్దుబాటు ప్రక్రియ జీఓ నెంబర్ 29 ప్రకారం చేపట్టాలని నోబెల్ టీచర్ అసోసియేషన్ సభ్యులు నల్లమల రామాంజులు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో జీఓ నెంబర్ 117, 53 ప్రకారం విద్యా వ్యవస్థ పూర్తిగా నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అదే జీఓల ప్రకారం సర్దుబాటు ప్రక్రియ చేప డితే పూర్తిగా విద్యా వ్యవస్థ నాశనం అవుతుందని అసోసియేషన్ (ఎన్‌టీఏ) ప్రభుత్వాన్ని కోరారు. టీడీపీ ప్రభుత్వంలో విడుదలైన జీఓ నెంబర్ 29, 22-5-2017 ప్రకారం సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని తెలియజేశారు. ప్రస్తుతం విద్యాశాఖ అధికారులు ఇంకా వైసీపీ ప్రభుత్వ జీఓలను అమలు చేస్తే విద్యా వ్యవస్థ నాశనం అవుతుందని నోబెల్ టీచర్స్ అసోషియేషన్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

వివిధ మండలాల్లో బాధ్యతల చేపట్టిన ఎస్ఐలు



ఎస్ఐలుగా బాధ్యలు చేపడుతున్న నరసింహారెడ్డి (రాయచోటి అర్బన్) - రవీంద్రబాబు (లక్కిరెడ్డిపల్లె) - పి.మహేష్ (ఓబుళవారిపల్లె) - రామకృష్ణ (గాలివీడు) - భక్తవత్సలం(సంబేపల్లె)

రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన తర్వాత వివిధ శాఖల్లో ప్రక్షాళన చేపట్టారు. ఇందులో భాగంగా పోలీసు, రెవెన్యూ తదితర ప్రధాన శాఖల్లో బదిలీలు జరిగాయి. కాగా సాధారణ బదిలీల్లో పలు సబ్‌డివిజన్ పోలీసు అధికారులు, సర్కిళ్లకు కొత్త ఇన్‌స్పెక్టర్లను పోస్టింగ్ ఇస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు ఇచ్చారు. కాగా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసులు, ఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వెంటనే బాధ్యతలు చేపట్టాలనడంతో ఎస్ఐలు ఆదివారమే బాధ్యతలు చేపట్టారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజలతో మమేకమై పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా చూస్తానన్నారు. గజాయి, ఎర్రచందనం, అక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టి పేకాట, కోడిపందాలు, మట్కా, క్రికెట్ బెట్టింగ్, అవినీతిపై ఉక్కుపాదం మోపు తామన్నారు. వివరాల్లోకెళితే...

రాయచోటి అర్బన్ ఎస్ఐ నరసింహారెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు11: రాయచోటి అర్బన్ ఎస్ఐగా నరసింహారెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆఫీసు నుంచి రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ రవీంద్రబాబు

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు 11: సబ్ఇన్‌స్పెక్టర్‌గా రవీంద్రబాబు బాధ్యతలు చేపట్టారు. రవీంద బాబు పెద్దసముద్రం ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై లక్కిరెడ్డిపల్లెకు వచ్చారు.

ఓబులవారిపల్లె ఎస్ఐ మహేష్

ఓబులవారిపల్లె, ఆగస్టు 10: ఓబులవారిపల్లె ఎస్ఐగా పి.మహేష్ బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా దిశ విభాగంలో పనిచేస్తున్న ఆయన ఓబులవారిపల్లె ఎస్ఐ బదిలీ అయ్యారు.

గాలివీడు ఎస్ఐ రామకృష్ణ

గాలివీడు, ఆగస్టు11: గాలివీడు ఎస్ఐగా పీ. రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వెంకటప్రసాద్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సంబేపల్లె ఎస్ఐ రామకృష్ణను నియమించారు.

పుల్లంపేట ఎస్ఐగా మోహన్‌కుమార్

పుల్లంపేట, ఆగస్టు 11: పుల్లంపేట ఎస్ఐగా జె.మోహన్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారు. రాజంపేట అర్బన్ ఎస్ఐగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు.

సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం

సంబేపల్లె, ఆగస్టు11: సంబేపల్లె ఎస్ఐగా భక్తవత్సలం బాధ్యతలు స్వీకరించారు. సంబేపల్లె ఎస్ఐ రామకృష్ణ బదిలీ కావడంతో ఆయన స్థానంలో రాయచోటి అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం బదిలీపై వచ్చారు.

వైభవంగా ముత్తుమారెమ్మ జాతర



నందలూరు, ఆగస్టు 10: అరవపల్లెలో వెలసిన ముత్తుమారెమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. కన్యకచెరువు సమీపంలోని అనంతపురమ్మతల్లి దగ్గరకు తమ్ముడు పోతురాజు వెళ్లి ఆమెను వెంట బెట్టుకు రాగా జాతర తంతు మొదలైంది. మహిళలు పెద్దఎత్తున అంబళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం నిర్వహించిన మ్యాజిక్ షో ప్రజలను అలరింపజేసింది.

ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ



సంబేపల్లె, ఆగస్టు11: సంబేపల్లె దేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

ఏపూరమ్మకు బోనాలు



సుండుపల్లె, ఆగస్టు11: ఏపూరమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిమ్మసముద్రం పంచాయతీ పీలేరు రహదారి పక్కన వెలిసిన ఏపూరమ్మ తల్లి భక్తుల పాలిట కల్పవల్లిగా విరాజిల్లుతోంది. ఆదివారం చెన్నంశెట్టి రామప్రదీప్, శ్రావణి కుటుంబ సభ్యులు అమ్మవారికి బోనాలు సమర్పించి ఆలయం సమీపంలో అన్నదానం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్ నాయుడు, టీడీపీ సీనియర్ నేతలు చెన్నంశెట్టి వెంకట్రమణ, నగేశ్, తోట రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మ తల్లికి బోనాలు



సుండుపల్లె, ఆగస్టు11: పెద్దినేనికాలువ పంచాయతీ ఈడిగపల్లె వద్ద వెలసిన నాగారపమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలను సమర్పించారు. రాయచోటి, పీలేరు, రాజంపేట నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. భక్తులు అమ్మవారికి తలనీలాలను సమర్పించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

రైళ్లు నిలుపుదల కోసం వినతి

పుల్లంపేట, ఆగస్టు 11: నంద్యాల, రేణిగుంట, తిరుపతి, నిజామాబాద్, చిత్తూరు, కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పుల్లంపేటలో స్టాపింగ్ ఇవ్వాలని రైల్వే కాన్సులేటెడ్ కమిటీ సభ్యులు రైల్వే అధికారులను కోరారు. పుల్లంపేట రైల్వేస్టేషన్‌లో సమస్యలపై చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌యాదవ్, స్టేషన్ మేనేజర్ చంద్రమౌళితో రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. కార్యక్రమంలో రైల్వే కాన్సులేటెడ్ శ్రీనివాసులు, గండికోట రామక్రిష్టయ్య, శంకర్‌రాజు, ప్రకాష్‌రాజు, నాగేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చోరీపై విచారణ

సిద్దవటం, ఆగస్టు 11: బంగారపేటలో గుండ్ల రామక్రిష్ణ, వసంత ఇళ్లల్లో జరిగిన చోరీపై ఒంటిమిట్ట సీఐ మోహన్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం ఉదయం బళ్లారిలో ఓ ఫంక్షన్‌కు రెండు కుటుంబీకుల వారూ బయలుదేరి వెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు, బీరువా పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగిందని పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

ఓబులవారిపల్లె ఆగస్టు 11: రైతులకు ఆదాయాన్నిచ్చే ప్రకృతి వ్యవసాయమే మేలని ఎంసీఏ బుల్లయ్య సూచించారు. చిన్నఓరంపాడు పంచాయతీలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతు నాగేళ్ల సుబ్బమ్మ తమలపాకు తోటకు వేపకాయల కషాయం తయారు చేశారు. ప్రకృతి వ్యవసాయానికి చుట్టుపక్కల ఉండే వనరులైన ఆకులు, కాయలతోనే కషాయాలు తయారు చేసుకోవచ్చన్నారు.

'హర్ ఘర్ తిరంగ్' విజయవంతం చేయాలి



రైల్వేకోడూరు, ఆగస్టు 11: బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ గడ్డం చంగల్‌రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దాసరాజు జయప్రకాష్ నారాయణవర్మ, రాష్ట్ర కిసాన్ మోర్చా నేతలు తోట శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి

రాజంపేట, ఆగస్టు 10: వక్ఫ్‌బోర్డు ఆస్తుల సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని రాజంపేట ముస్లిం మైనార్టీ నేత షేక్ సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు చట్టంలో 114 సెక్షన్లు ఉన్నాయని, వాటిలో 40 సెక్షన్లను సవరణ చేయాలని కేంద్రం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టిందన్నారు. ముస్లింల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ఎండోమెంట్ తరహాలో అధికారాలు ఇవ్వాల్సింది పోయి ప్రస్తుతం బోర్డుకున్న అధికారాలను కుదించే బిల్లు ప్రవేశపెట్టడం సరికాదన్నారు. కావున ఈ బిల్లును వెంటనే వెనుక్కు తీసుకోవాలన్నారు. రాజంపేట ముస్లిం మైనార్టీ నేతలు షేక్ ముజఫర్ అహ్మద్, ఎస్ఎండీ కరీం, మోసిన్‌ఖాన్, ఆరిఫ్‌ఖాన్, సయ్యద్‌మసూద్, నిషార్, సాహిద్, సలీం, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

మైనార్టీ మంత్రి ఫరూఖ్‌తో రాజంపేట నేతలు భేటీ



రాజంపేట, ఆగస్టు 10: మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్‌తో రాజంపేట టీడీపీ మైనార్టీ నేతలు భేటీ అయ్యారు. ఆదివారం రాజంపేట పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి మండెం అబుబకర్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరుకు వచ్చిన మంత్రిని కలిసి ఆయనను సత్కరించారు. మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. కార్యక్రమంలో రాజంపేట మైనార్టీ నేతలు ఎస్కే కరీం, షేక్ సాహిద్, అష్రఫ్ ఖాన్, వీకే మస్తాన్, మండెం గౌస్, వాహిద్ పాల్గొన్నారు.

రామాపురం తహసీల్దార్‌గా రామాంజనేయులు



రామాపురం, ఆగస్టు11: రామాపురం తహసీల్దార్‌గా రామాంజనేయులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు అనంతపురం జిల్లాకు వెళ్లడంతో రామాపురానికి రాయచోటి డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయుల ఇక్కడికి బదిలీ అయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వరరావు, ఆర్ఐ రవికుమార్, వీఆర్ఓలు నరసింహులు, వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, విగ్నేశ్, ప్రేమ సాగర్, హేమలత, ఈశ్వరయ్య, అజీజ్‌వుల్లా, పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న నాటుబాంబులు

నాటుబాంబుల కలకలం

● మణిపిరెడ్డిపల్లెలో 26 స్వాధీనం ● పోలీసుల అదుపులో ఇద్దరు

పాకాల, ఆగస్టు 11: పాకాల మండలంలోని చెన్నుగారిపల్లె పంచాయతీ మణిపిరెడ్డిపల్లెలో నాటుబాంబులు కలకలం సృష్టించాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మణిపిరెడ్డిపల్లె రైల్వేగేటు సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఓ ఇంట్లో ఆదివారం 26 నాటుబాంబులను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటిని తయారు చేస్తున్న బాబు, గజేంద్రలను అదుపులోకి తీసుకున్నారు. పందుల పెంపకంతో జీవనం సాగిస్తున్న వీరు అడవి పందులను వేటాడడానికి నాటుబాంబులు తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు. గుండ్రంగా ఉండే ఈ బాంబులను అడవి పందులు సంచరించే ప్రదేశాల్లో పెడతారు. అవి తినడానికి ప్రయత్నించినపుడు పేలి అడవి పంది ముఖం ఛిద్రమవుతుంది. ఆ తర్వాత పందిని స్వాధీనం చేసుకుని, దాని మాంసాన్ని వీరు విక్రయిస్తున్నట్లు తెలిసింది. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


నిందితులు గజేంద్ర, బాబు

జిల్లాలో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 11: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. తవణంపల్లెలో 3.0, శ్రీరంగరాజపురం 1.8, కుప్పం 1.4, చిత్తూరు అర్బన్‌లో 1.2 మి.మీ వర్షం కురిసింది.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా : కలెక్టర్


ఎస్టీయూ నేతలతో సమావేశమైన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 11: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సోమవారం జడ్పీ కార్యాలయం ఎదుట ఎస్టీయూ మహాధర్నా చేపట్టనున్న నేపథ్యంలో కలెక్టర్ స్పందించి జడ్పీ ఛైర్మన్, సీఈవోలతో ఆదివారం మధ్యాహ్నం చర్చించారు. సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎస్టీయూ నేతలతో సమావేశమయ్యారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ మాట్లాడుతూ జీపీఎఫ్ తరహాలో జడ్పీ పీఎఫ్‌ను మెరుగుపరచాలని కోరారు. జడ్పీ పీఎఫ్ నిర్వహణ లోపాల వల్ల పీఎఫ్ స్లిప్పులు అందుబాటులోకి రావడం లేదని చెప్పారు. తద్వారా పీఎఫ్ రుణాలు, తుది మొత్తాలు తీసుకోవాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితాల విడుదలలో జాప్యం జరుగుతోందని, తద్వారా పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో అవకతవకలకు ఆస్కారం ఏర్పడుతుందని ఆందోళన వెలిబుచ్చారు. పాఠశాలల స్థలాలను సర్వే చేయించి, ఆక్రమణలు తొలగించాలన్నారు. కారుణ్య నియామకాల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో మహాధర్నాను వాయిదా వేస్తున్నట్లు ఎస్టీయూ జిల్లా శాఖ ప్రకటించింది. ఈ సమావేశంలో జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, సీఈవో గ్లోరియా, ఎస్టీయూ నేతలు పురుషోత్తం, దేవరాజులురెడ్డి, చంద్రన్, మంజునాథ్, లింగయ్య, కమలాపతి పాల్గొన్నారు.

ఘనంగా ఎద్దుల పరుగు పందెం పండుగ


పశువులు పరుగు పందెంలో బారికేట్లు మధ్యలోని బాజీలో పరుగులు తీస్తున్న ఎద్దు

శాంతిపురం, ఆగస్టు 11 : తిమ్మరాజుపల్లె సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం ఎద్దుల పరుగు పందెం పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం రంగు రంగుల కాగితాలతో పశువులనుముస్తాబు చేశారు. తరువాత సాంప్రదాయంగా వీధుల్లో తోరణం కింద జంతు బలులిచ్చి బాజీలో పశువులను పరిగెత్తించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యారికేట్ల బాజీలో పరుగు పందెం నిర్వహించారు. పోటీలో పాల్గొనేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా తమిళనాడు,కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భారీ ఎత్తున ఎద్దులను తీసుకువచ్చారు. మొదటి బహుమతి రూ.1,00,000 కాగా రెండవ బహుమతి రూ.90,000గా నిర్ణయించారు. సుమారు 50 బహుమతులతో పోటీలు నిర్వహించారు. సుమారు 500 ఎద్దులు పోటీలలో పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎద్దుల పండుగ ప్రశాంతంగా జరిగింది. దేవాలయ ప్రాంగణం జనసంద్రంగా మారింది. సాయంత్రం విజేత ఎద్దు యజమానులకు బహుమతులు అందజేశారు.

నగరపాలక అధికారులపై 'విజిలెన్స్'

● టీడీఆర్ బాండ్ల జారీ, నిధులు దుర్వినియోగం చేసిన అధికారుల్లో గుబులు
● విచారణకు ఆదేశించిన మంత్రి నారాయణ



తిరుపతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలక సంస్థలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ మంత్రి నారాయణ ఆదేశించారు. ఆమేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి విభాగపు స్పెషల్ చీఫ్ సెక్రటరీకి లిఖితపూర్వక ఆదేశాలిచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి నగర పాలక సంస్థలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రజాదర్బార్ (ఆర్టీజీ)లో భాగంగా మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. ఈక్రమంలో మంత్రి నారాయణకు తిరుపతి కార్పొరేషన్లోని అవినీతి అధికారుల గుట్టు విప్పాలని మంత్రి లోకేశ్ ద్వారా ఫిర్యాదులు వెళ్లాయి. దాంతో విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ నారాయణ నిర్ణయం తీసుకోవడంతో అవినీతి అధికారుల్లో గుబులు పట్టుకుంది. తిరుపతిలో జరిగిన ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. రూ.4వేల కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగినట్టు అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ నేతలు ఆరోపించారు. అభివృద్ధి పేరుతో తుడా వేయాల్సిన మాస్టర్ ప్లాన్ రోడ్లను పక్కా ప్రణాళికతో తెరపైకి తీసుకొచ్చి స్థలాలు కోల్పోయిన వారి పేర్లతో బాండ్లు తీసుకుని కోట్లు కొల్లగొట్టారు. అగ్రికల్చర్, రెసిడెన్షియల్ పరిధిలోని స్థలాలను కూడా కమర్షియల్‌గా రిజిస్ట్రేషన్ విలువ పెంచేసి భారీగా లబ్ధి పొందారు. వైసీపీ నేతల జేబుల్లోకి దాదాపు రూ.400 కోట్ల వరకు వెళ్లినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగంలో ఇష్టానుసారంగా నిధులు దుర్వినియోగమయ్యాయన్న విమర్శలూ ఉన్నాయి. ఇక గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన అధికారులపై కూడా విచారణ జరగనున్నట్టు తెలుస్తోంది.

గుత్తార్లపల్లెలో ఆక్రమణదారుల దౌర్జన్యం

● ప్రశ్నించిన వీఆర్‌వోపై దాడి




వడ్డెవానిగుట్టలో వీఆర్వోతో ఘర్షణ పడుతున్న ఆక్రమణదారులు - గాయపడి చికిత్స పొందుతున్న వీఆర్వో కుమార్ - ఆక్రమిత భూమిలో కొబ్బరి మొక్కలు

గుడుపల్లె, ఆగస్టు 11: ఆక్రమణదారుల ఆగడాలకు అంతూపొంతూ లేకుండాపోతోంది. తమను ప్రశ్నించారనే కోపంతో వీఆర్‌వోపై దాడి చేసి గాయపరిచారు. వివరాలివి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు...కుప్పం-గుడుపల్లె ప్రధాన రహదారి గుత్తార్లపల్లెకు కొంత దూరంలో సర్వే నెంబరు 62లోని, 15.20 ఎకరాల విస్తీర్ణంలో వడ్డెవానిగుట్ట భూమి రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ఈ గుట్ట భూమిలో కుప్పానికి చెందిన వైసీపీ నాయకుడు అక్రమంగా క్వారీని నిర్వహించాడు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో వైసీపీ నాయకుడు క్వారీ పనులను ఆపేశాడు. ఆ తరువాత గ్రామస్థులు వడ్డెవానికుంట భూమిని ప్రభుత్వ ప్రజల అవసరాల కోసం ఉపయోగించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఇదే భూమిలో ఈ నెల 9న గుండ్లసాగరానికి చెందిన ఆర్ముగం భవనం నిర్మించడానికి పూనుకొన్నారు. గ్రామస్థులు గుర్తించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు చేరుకుని పోలీసుల సహాయంతో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈనేపథ్యంలో ఆదివారం వడ్డెవానికుంట భూమిలో గుండ్లసాగరానికి చెందిన రాజేంద్ర, ఆర్ముగం, గోవిందప్పలు కొబ్బరి చెట్లు నాటుతున్నట్లు గ్రామస్థులు తెలుసుకొన్నారు. ఈ విషయాన్ని డీటీ కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో వీఆర్‌వోలు కుమార్, జస్వంత్, వీఆర్‌ఏ నాగేంద్ర వెంటనే వడ్డెవానిగుట్టకు చేరుకున్నారు. గ్రామస్థులు కూడా చేరుకున్నారు. అక్కడి భూమిలో కొబ్బరి మొక్కలు నాటుతున్న రాజేంద్ర, ఆర్ముగం, గోవిందప్పలను వీఆర్‌వోలు ప్రశ్నించారు. దీంతో వారు ఆగ్రహోదగ్రులయ్యారు. రెవెన్యూ సిబ్బందిని అసభ్య పదజాలంతో దూషించారు. ఆ తరువాత గుండ్లసాగరం వీఆర్‌వో కుమార్‌పై ఆక్రమణదారులు దాడి చేశారు. దాడిలో గాయపడిన వీఆర్‌వో కుమార్‌ను గ్రామస్థులు కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి సంఘటనపై రెవెన్యూ సిబ్బంది గుడుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

ఎంపీపీ సవాల్ మేరకు రూ.25 కోట్ల ఆస్తి ప్రజలకు రాసివ్వండి

లేకుంటే పదవికి రాజీనామా చేయాలి ● టీడీపీ నేతల డిమాండు
● వాయిదా పడిన వి.కోట మండల సమావేశం



మండల కార్యాలయంలోకి వెళుతున్న టీడీపీ శ్రేణులు - టీడీపీ నేతలతో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

వి.కోట, ఆగస్టు 11: వైసీపీ అధికారంలో ఉండగా చేసిన సవాలు మేరకు ఎంపీపీ యువరాజ్ తన రూ.25 కోట్ల ఆస్తిని ప్రజలకు రాసివ్వాలన్న టీడీపీ నేతలు డిమాండు చేశారు. ఈ మేరకు వీరు మండల పరిషత్ కార్యాలయంలోని రావడంతో సమావేశం వాయిదా పడింది. ఆదివారం వి.కోట మండల సర్వసభ్య సమావేశం ఉండటంతో ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం మొదలవుతుందని అందరూ బావించారు. అనూహ్యంగా మండల పరిధిలోని టీడీపీ సర్పంచులు, ఇతర మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఆయన గతంలో కుంబార్లపల్లె పంచాయతీలో ఒక్క ఓటు మెజారిటీ వచ్చినా తన రూ.25 కోట్ల ఆస్తి రాసిస్తామన్న సవాల్‌ను వీరు గుర్తుచేశారు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీకి ఆ పంచాయతీలో తిరుగులేని మెజారిటీ రావడంతో గతంలోనే ఓసారి ఇదే డిమాండుతో కార్యాలయాన్ని ముట్టడించారు. అప్పట్లో ఎంపీపీ లేకపోవడంతో వెనుదిరిగారు. అప్పటి వాగ్దానానికి కట్టుబడి ఆస్తి రాసివ్వాలని, లేకుంటే ఎంపీపీ పదవికి రాజీనామా చేయాలంటూ ఆదివారం కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు టీడీపీ నేతలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీనికి వారు పట్టించుకోలేదు. చివరగా జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ఇరు పక్షాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అందుకు ఇరుపక్షాలు అంగీకరించక పోవడంతో కార్యాలయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎట్టకేలకు పోలీసుల సహకారంతో ఎంపీపీ యువరాజ్ కార్యాలయం నుంచి బయటకు వచ్చేశారు. సమావేశం వాయిదా పడటంతో ఎంపీటీసీలు, అధికారులు అందరూ వెనుదిరిగారు. ఎంపీపీ సవాల్‌ను పలువురు గుర్తుచేసుకుంటూ.. రాజకీయాల్లో ఎప్పుడు, ఏం జరుగుతుందో ఎవరూ ఊహించరని, ఎదుటి వారిపై మాట్లాడేప్పుడు సంయమనం వహించాలని పేర్కొన్నారు.

రమేష్ చంద్రప్రసాద్‌కు పలువురి నివాళి



రమేష్ చంద్ర ప్రసాద్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితర నేతలు

నింద్ర, ఆగస్టు 11: ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్‌కు పలువురు నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఆయన స్వగ్రామమైన నింద్ర మండలం ఉరూరుపేటలో ఆదివారం కర్మక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. టీడీపీకి రమేష్‌చంద్ర ప్రసాద్ చేసిన సేవలను పలువురు ఎమ్మెల్యేలు, నేతలు గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయనకు పుష్పాంజలి ఘటించిన వారిలో మాజీ మంత్రి కరణం బలరాం, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, ఆదిమూలం, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, జయచంద్రనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, నేతలు ఎస్సీవినాయుడు, నేతలు చంద్రప్రకాష్, అశోక్‌రాజు, ఆర్సీ మునికృష్ణ, ఎంఎం రాధాకృష్ణ, చినబాబు, ప్రకాష్‌నాయుడు, పాకారాజా, వెంకటేశ్వరరావు, ధనంజయనాయుడు, దశరధవాసు, గాలి రమేష్‌నాయుడు, ఢిల్లీబాబు, గంగాధరం నాయుడు, ధనంజయయాదవ్, ధనంజయనాయుడు, లక్ష్మీపతిరాజు, గిరి, మురళీనాయుడు, రవికుమార్, గిరిబాబు, శివక్రిష్ణమనాయుడు, పీఎన్. రాధాకృష్ణ, గజేంద్ర నాయుడు, చంద్ర, రమేష్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

19న శ్రీసిటీకి సీఎం చంద్రబాబు

రేపు షార్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక



తడ, ఆగస్టు 11: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెలలో జిల్లాలో విడివిడిగా పర్యటించనున్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్)లో మంగళవారం జరగనున్న అంతరిక్ష దినోత్సవాల్లో పాల్గొనడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రానున్నారు. తిరుపతి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చి అక్కడినుంచి హెలికాప్టర్‌లో శ్రీహరికోటకు చేరుకుంటారు. అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి హెలికాప్టర్‌లో విమానాశ్రయానికి చేరుకుంటారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 19వ తేదీన శ్రీసిటీకి రానున్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానం మేరకు ఆయన సెజ్‌లో పర్యటించేందుకు సమ్మతించారు. ఆ రోజంతా ఆయన శ్రీసిటీలోనే ఉండనున్నట్లుగా సమాచారం. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి జిల్లాకు రానుండటంతో అధికారులు భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వీరి పర్యటనకు సంబంధించి అధికారిక సమాచారం అందిందని.. ఏర్పాట్లు చేస్తున్నామని సూళ్లూరుపేట ఇన్‌చార్జి ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో క్వారీ వద్ద కూలీ మృతి


మృతిచెందిన చిన్నస్వామి

పలమనేరు, ఆగస్టు 11: పలమనేరు మండలం కొలమాసనపల్లి సమీపంలోని క్వారీ వద్ద ఆదివారం చిన్నస్వామి అనే కూలీ మృతి చెందారు. ఇతడి మృతిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. తమిళనాడుకు చెందిన ఈయన కొంతకాలంగా ఎర్రగుండేపల్లిలోని అన్నా వదినల వద్ద ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం క్వారీ వద్దకు వెళ్లిన చిన్నస్వామిని అపస్మారకస్థితిలో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఈయన క్వారీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు జేసీబీ బకెట్ వీపుపై పడటంతో ఆస్పత్రికి తీసుకొచ్చారని కొందరు చెబుతున్నారు. ఇక్కడి వైసీపీ నాయకులు మాత్రం విలేకరుల సమావేశం నిర్వహించి జీతం డబ్బులు అడిగాడని క్వారీ నిర్వాహకులు కొట్టడంతో చిన్నస్వామి చనిపోయాడని ఆరోపిస్తున్నారు. విషయం బయటకు పొక్కకుండా క్వారీ నిర్వాహకులు చిన్నస్వామికి చెందిన వారికి రూ.లక్ష ఇచ్చారని తెలిసిందన్నారు. దీనిపై పోలీసులు విచారణ జరిపించాలని కోరారు. అక్రమ మైనింగ్‌లో చిన్నస్వామి మృతి చెందినందున ఆయన కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. దీనిపై డీఎస్పీ విష్ణు రఘువీర్‌ను విలేకరులు వివరణ కోరగా.. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. పోస్టుమార్టం రిపోర్టులో చిన్నస్వామి మృతికి గల కారణాలు తెలుస్తాయన్నారు. జీతాల కోసం కొట్టి చంపారన్న వైసీపీ నాయకుల ఆరోపణ నమ్మశక్యంగా లేదన్నారు. రాజకీయ లబ్ధికి నాయకులు ఆరోపణలు చేయడం సహజమన్నారు. కాగా, పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నస్వామి మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు నిందితుల అరెస్టు



చిత్తూరు, ఆగస్టు 11: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒకటో పట్టణ సీఐ జయరామయ్యతో కలిసి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. చిత్తూరు-బండపల్లె రోడ్డులో మిట్టూరుకు చెందిన మదన్(26), మనోజ్(23)లు సైకిళ్లపై గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందింది. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా మదన్ వద్ద రెండు కిలోలు, మనోజ్ వద్ద కిలో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. రూ. 75వేల విలువ చేసే మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ సుమన్, సిబ్బంది సురేష్, జనార్దన్, సుధాకర్, సుదర్శన్, సుల్తాన్‌లను డీఎస్పీ అభినందించారు.

వీఆర్వోల ప్రైవేట్ గదుల్లో రికార్డులు

వాటి భద్రతపై అనుమానాలు - రేణిగుంట విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల రూటే సపరేటు


రేణిగుంటలోని వీఆర్వోల ప్రైవేట్ కార్యాలయంలో ఉన్న రికార్డులు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

రేణిగుంట మండల పరిధిలోని వీఆర్వో (విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్)ల వ్యవహారశైలిపై విమర్శలు వస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం కాదని సొంతంగా అద్దె గదులను తీసుకుని ఎక్కువ సమయం అక్కడే ఉంటారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక వారి పంచాయతీకి సంబంధించిన రెవెన్యూ రికార్డులను అక్కడే ఉంచుకున్నట్టు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులకు ఖాళీగా ఉన్న రెవెన్యూ, వివాదాస్పద భూముల పత్రాలను చూపించి వారి కబ్జాకు సహకరించారన్న ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ప్రైవేట్ గదులను వదిలిపెట్టడంలేదని తెలుస్తోంది. సోమవారం మాత్రం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమయంలో ఓ గంటపాటు ఉండి తక్కిన సమయం ఆ గదుల్లోనే ఉంటూ సేద తీరుతుంటారని సమాచారం. వారి కోసం ఎవరొచ్చినా తహసీల్దార్ కార్యాలయం కాకుండా సొంత కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. తొలుత అక్కడ 'సెటిల్' చేసుకుంటేనే తహసీల్దార్ కార్యాలయం వరకు ఫైలు కదులుతుందన్న ఆరోపణలు పెద్దఎత్తున ఉన్నాయి. ఇవి అటుంచితే రెవెన్యూ రికార్డుల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ గదుల్లో ఎక్కడపడితే అక్కడ రికార్డులు, పత్రాలు పడి ఉన్నాయి. ముఖ్యమైన రికార్డులు కనిపించకపోయినా, ఎవరైనా అపహరించినా బాధ్యత ఎవరిదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కలికిరి సీఐగా రెడ్డిశేఖర్ రెడ్డి



కలికిరి, ఆగస్టు 11: కలికిరి పోలీస్ ఇన్‌స్పెక్టరుగా కె. రెడ్డిశేఖర్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తిరుమల సీసీఎస్ నుంచి బదిలీ మీద వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. ప్రధానంగా పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ఆర్. మోహన్ ఎస్పీ కార్యాలయానికి వేకన్సీ రిజర్వ్‌లో బదిలీ చేశారు. ఇదిలా ఉండగా గత ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకుల ఆగ్రహానికి గురై మదనపల్లె పట్టణ పోలీసు స్టేషన్‌కు అటాచ్‌మెంట్‌లో వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ మదనమోహన్‌రెడ్డిని తిరిగి కలికిరి స్టేషనుకు వెనక్కు పంపుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశా రు. ఈ మేరకు ఆదివారం మదన మోహన్ రెడ్డి కూడా కలికిరి పోలీసు స్టేషను బాధ్యతల్లో చేరారు. ఏఎస్ఐ మధుసూదనాచారి, హెడ్ కానిస్టేబుల్ మనోహర్‌లు కూడా వివిధ స్టేషన్ల అటాచ్ మెంట్‌ల నుంచి రెండు రోజుల క్రితమే కలికిరిలో చేరిన విష యం తెలిసిందే.

బదిలీపై వెళుతున్న పోలీసు అధికారులకు ఘనసన్మానం



బదిలీ అయిన పోలీసు అధికారులను సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది, స్థానికులు

పీలేరు, ఆగస్టు 11: పీలేరు అర్బన్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీ అయిన సీఐ, ఎస్ఐలను ఆదివారం స్థానిక సిబ్బంది, ప్రజలు ఘనంగా సన్మానించారు. పీలేరు అర్బన్ సీఐగా పని చేస్తుండిన మోహన్ రెడ్డి, నరసింహుడు, రమణయ్యలు ఇటీవల పీలేరు నుంచి బదిలీ అయ్యారు. మోహన్ రెడ్డి వీఆర్‌కు, నరసింహుడు పీటీఎంకు, రమణయ్యకు మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వారు ముగ్గురినీ ప్రస్తుత సీఐ యుగంధర్ నేతృత్వంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు.

నలుగురు ఎస్ఐలు బాధ్యతలు స్వీకరణ



కృష్ణమూర్తి టూటౌన్ ఎస్ఐ



రహిమ్ టూటౌన్ ఎస్ఐ- 2

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11: మదనపల్లె పట్టణంలోని టూటౌన్, వన్ టౌన్, తాలుకా పోలీసు స్టేషన్లకు నలుగురు ఎస్ఐలు బదిలీ పై వచ్చి శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇందులో భాగంగా మదనపల్లె టూటౌన్‌కు ఎస్ఐ గా కృష్ణమూర్తి, రెండో ఎస్ఐగా రహిమ్, తాలుకా ఎస్ఐ గా హరిహరప్రసాద్, వన్‌టౌన్ ఎస్ఐగా శ్రీనివాసుల నాయక్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్వర న్యాయం అందిస్తామన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు కృషి చేస్తామని చెప్పారు.

పెద్దతిప్పసముద్రం ఎస్ఐగా నరసింహుడు



పెద్దతిప్పసముద్రం ఆగస్టు 11 : పెద్దతిప్ప సముద్రం పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఎంకే నరసింహుడు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన ఎస్ఐ రవీంద్రబాబు కడప జిల్లా లక్కిరెడ్డిపల్లె కు బదిలి అయ్యారు. ఆయన స్థానంలో ఎస్ఐగా ఎంకే. నరసింహుడు పెద్దతిప్పసముద్రం ఎస్ఐగా వచ్చారు. ఈయన గతంలో పీలేరులో పని చేస్తూ బదిలీపై పెద్దతిప్పస ముద్రంకు వచ్చాడు . ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. అనంతరం స్టేషన్‌లో పోలీస్ సిబ్బంది నూతన ఎస్ఐ నరసింహుడుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియచేశారు.

ములకలచెరువు ఎస్ఐగా గాయత్రి



ములకలచెరువు, ఆగస్టు 11: ములకల చెరువు ఎస్ఐగా గాయత్రి ఆదివారం బాధ్య తలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా దిశ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న ఆమెను ఇక్కడికి బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న తిప్పేస్వామిని జిల్లా దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన గాయత్రి మాట్లాడుతూ శాంతి భద్రల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య



మృతుడు అమరతేజ (ఫైల్‌ఫోటో)

వాల్మీకిపురం, ఆగస్టు 11: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం అర్ధరాత్రి వాల్మీకిపురంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె అమినేనివీధికి చెందిన వెంకట రాజు కుమారుడు అమరతేజ(29) శని వారం అర్ధరాత్రి వాల్మీకిపురం సమీపంలోతిరుపతి వైపు వెళ్తున్న ప్యాసింజర్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అప్పులు, బెట్టింగులతోనే అమరతేజ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

చెత్తకుప్పలు ఇలా.. పారిశుధ్యమెలా?



పీటీఎం డంపింగ్ యార్డులో కాకుండా ఆరుబయట చెత్తను పారబోసి నిప్పంటించిన దృశ్యం



పెద్దమండ్యంలో నిరుపయోగంగ పడిఉన్న చెత్త సేకరణ వాహనం

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 11 :పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారి చెత్తకుప్పలు పేరుకుపోయి పరిశుభ్రత ప్రశ్నార్థకంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా తయారై పారిశుధ్యమెరుగునకు పెనుసవాలుగా నిలిచింది. గ్రామాల్లో పడిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి చెత్త నుంచి సంపదను సృష్టించే విదానాన్ని 2014-19 సంవత్సరాల మధ్యకాలంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పక్కా ప్రణాళికతో పటిష్టంగా అమలు చేసింది. ఇందులో భాగంగా మండలంలోని ఆయా పంచాయతీలకు లక్షలు వెచ్చించి డంపింగ్ యార్డు నిర్మాణాలు చేపట్టి వాటి నిర్వహణల కోసం గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసి వారిచే పని చేయించాల్సిన బాధ్యతలను ఆయా పంచాయతీలకు అప్పగించింది. అయితే 2019 సంవత్సరంలో అధికా రంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీల్లో ఉన్న డంపింగ్ యార్డులను పట్టించుకోకపోవడంతో డంపింగ్ యార్డులు నిర్వీర్యమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో చెత్తాచెదారంతోపాటు మురుగు కాలువల్లో సైతం చెత్తతో పేరుకుపోయాయి. కాగా గ్రీన్ అంబా సిడర్లకు జీతాలు చెల్లించకపోవడంతో చెత్తనుంచి సంపద సృష్టించే కేంద్రాలు నిరుపయోగంగా మారిపోయాయి. మండల కేంద్రమైన పీటీ ఎంలో ఉన్న డంపింగ్ యార్డు ఉన్నా పంచాయతీ కార్మికులు చెత్తను డంపింగ్ యార్డులో కాకుండా బహిరంగ ప్రదేశాల్లో పారబోసి చెత్తకు నిప్పు పెడుతుండడంతో కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. అదే విధంగా బూర్లపల్లె గ్రామంలో డంపింగ్ యార్డు ఉన్నప్పటికి చెత్తను అందులో వేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇకనైనా ఆయా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగవుపడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఆయా గ్రామా ల్లో ఉన్న డంపింగ్ యార్డులను సద్వినియోగం చేసుకుని చెత్తనుంచి సంపదను సృష్టించే కార్యక్రమాలను మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని చెత్త సేకరణ వాహనం

పెద్దమండ్యం, ఆగస్టు 11: పెద్దమండ్యం గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ వాహనం మరమ్మత్తులకు నోచుకోక నిరుపయోగంగా మూలనపడింది. వివరాల్లోకి వెలితే గత వైసీపీ ప్రభుత్వంలో స్వచ్ఛ భారత్ పథకం ద్వారా పైలట్ ప్రాజెక్టు కింద పెద్దమండ్యం గ్రామ పంచాయతీకి చెత్త సేకరణ వాహనం కేటాయించారు. ఆ వాహనాన్ని ఆర్భాటంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. అయితే గత ఒకటన్నర ఏడాది క్రితం ఆ వాహనం మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి వాహనాన్ని పట్టించుకోకపోవడంతో అది ప్రస్తుతం కదలేదని పరిస్థితి లో ఉంది. దీంతో పెద్దమండ్యం లో తోపుడు బండ్లల్లో మూడు రోజులు కొకసారి కార్మికులు చెత్త సేకరణ చేస్తున్నారు. ఇకనైన అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాలికపై దాడి.. నలుగురిపై కేసు నమోదు

● తప్పుడు కేసు పెట్టారంటూ బాధిత కుటుంబీకుల ధర్నా



బి.కొత్తకోట స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బాధిత కుటుంబీకులు

బి.కొత్తకోట, ఆగస్టు11: పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన అఫ్జల్, బావాజాన్, అక్బర్, చాంద్‌బాషాలతోపాటు మరికొందరు తన కుమార్తెపై దాడి చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ నలుగురిపై కేసు నమోదుచేసి విచారణలో భాగంగా ఆదివారం వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. విషయం తెలియడంతో నిందితుల కుటుంబీకులు స్టేషన్‌వద్దకు చేరుకొని తమ పిల్లల్ని అన్యాయంగా ఇరికించారని వారిని వదిలిపెట్టాలని పోలీసులను కోరుతూ పోలీస్‌స్టేషన్ బయట ధర్నా చేశారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఓ బాలిక కడప జిల్లాకు చెందిన ఓ యువకుడితో చనువుగా వుంటూ తరచూ ఫోన్‌లో సంభాషించేది. ఇది గమనించిన అదే కాలనీకి చెందిన కొంతమంది యువకులు ఆ బాలికతో ఫోన్ విషయమై చర్చించి మందలించారు. దీనిపై ఆగ్రహించిన బాలిక తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ఆ నలుగురి పై కేసు నమోదుచేసి విచారణలో భాగంగా స్టేషన్‌కు తరలించడం జరిగింది. అయితే నిందితుల కుటుంబీకులు స్టేషన్‌వద్దకు చేరుకొని తమ పిల్లల్ని అన్యాయంగా ఇరికించారని వారిని వదిలిపెట్టాలని పోలీసులను కోరారు. ఎఫ్ఐఆర్ నమోదైనందుకు వదలడం కుదరదని పోలీసులు చెప్పడంతో, వారు ఆగ్రహిస్తూ స్టేషన్ ఎదురుగా రోడ్డుపై భైఠాయించి ధర్నాకు దిగి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో బి.కొత్తకోట-మదనపల్లె మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలియడంతో ఆ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు, బాధితులు బంధువులు పెద్దసంఖ్యలో స్టేషన్‌వద్దకు చేరుకొని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఈ కేసుపై లోతుగా విచారించి న్యాయం చేయ్యాలని పెద్దలు సీఐ సూర్యనారాయణను కోరారు. ఈ మేరకు సీఐ హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

మదనపల్లె లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా నివేదిత



లయన్స్‌క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్ గవర్నర్ అశ్వర్థనారాయణ

మదనపల్లె టౌన్, ఆగస్టు 11: మదనపల్లె లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా డాక్టర్ నివేదిక ప్రమాణస్వీకారం చేశారు. ఆదివారం స్థానిక రింగ్‌రోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో లయన్స్‌క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ ఇంటర్నేషనల్ 317-ఇ గవర్నర్ అశ్వర్థనారాయణ, హెచ్‌టీ సీతారామ్ మాట్లాడుతూ ఏడాది పాటు డాక్టర్ నివేదిత లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా ఉంటారన్నారు. సామాజిక సేవల్లో విస్తృతంగా పాల్గొని లయన్స్ సేవలను ప్రజలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఏడీసీఎస్ గంగారపు గౌతమ్‌రెడ్డి, సంజీవరెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 11: ప్రభుత్వ నిబంధనల మేరకు మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో మాజీ సైనికుల సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ బీకేపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని భూ ఆక్రమణల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మాజీ సైనికులకు న్యాయం చేస్తానన్నారు. నిమ్మనపల్లె మండలం భూమలగడ్డలో మాజీ సైనికులకు కేటాయించిన ఆరున్నర ఎకరాల భూమి విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు, యూసఫ్, బాషా, ప్రతాపరెడ్డి, సులేమాన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ ర్యాలీని జయప్రదం చేయండి

ములకలచెరువు, ఆగస్టు 11: హైదరాబాదులో ఈనెల 13న జరిగే ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్, ఎంఎస్పీ కో ఇన్‌చార్జి తిరుపాల్ పిలుపు నిచ్చారు. ములకలచెరువులో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి హైదరాబాదుకు వస్తున్న సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, ఆగస్టు 11:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించి అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శంచుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆలయాభివృద్ధికి దాతలు విరాళం

రెడ్డెమ్మకొండ ఆలయం పునర్నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెకు చెందన వెంకటరమణ రూ.50,116, అలాగే బెంగుళూరుకు చెందిన వెంకట కిరణ్‌కుమార్ రూ.25,116 నగదును ఆలయ ఈవో మంజులకు అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగించాలని కోరారు. దాతలకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

బి.కొత్తకోట ఎంపీడీవోగా శంకరయ్య

బి.కొత్తకోట, ఆగస్టు11: బి.కొత్తకోట మండల ఎంపీడీవోగా ఎం.శంకరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో ఇక్కడ పనిచేస్తూ ఎన్నికల బదిలీల లో భాగంగా ఆయన పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు వెళ్లారు. తాజాగా ఉమ్మడి చిత్తూరుజిల్లా పరిధిలోని 26 మండలాలకు ఎంపీడీవోలను కేటాయిస్తూ చిత్తూరు జిల్లాపరిషత్ సీఈవో పి.గ్లోరియా ప్రొసీడింగ్స్ విడుదల చేశారు. ఈ జాబితాలో బి.కొత్తకోట మండల ఎంపీడీవో గా శంకరయ్య పేరు ఖరారైంది.

పేకాట రాయుళ్ల అరెస్ట్...కేసు నమోదు

నిమ్మనపల్లి, ఆగస్టు 11: మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతి కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపంలో వేప చెట్టు కింద గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 8 మంది జూదరులను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.6800లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొన్ని రోజులుగా పేకాట ఆడుతూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న జూదరులను పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి వారిని పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మహల్‌లో ఉరుసు

కలికిరి, ఆగస్టు 11: మండలంలోని మహల్ గ్రామంలో సోమవారం రాత్రి సాంప్రదాయానుసారం ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, ఆస్థాన పీఠాధిపతి వర్గ సభ్యులు డాక్టర్ మొహ్మద్ రియాజ్ బాషా బుఖారీ సాహెబ్ తెలిపారు. హజరత్ సయ్యద్ షా మహమూద్ బాషా బుఖారి ఖదరి షహమీరి సాహెబ్ వారి ఉరుసు మహోత్సవాన్ని ప్రతి ఏడాదిలాగే ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కలకడ, ఆగస్టు 11: బావపై కత్తితో దాడి చేసిన వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు..కలకడ రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గౌస్‌పీర్ కుమారుడు నవాజ్‌కు కడప నాగరాజుపేటకు చెందిన నౌసీమ్ తో 2020లో వివాహం జరిగిందన్నారు. అయితే నవాజ్‌ను భార్య పుట్టింటి ఊరైన కడపలో కాపురం పేట్టాలని కొద్ది రోజులుగా గొడవ పడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆమె ఆదివారం తన పుట్టింటి వారిని పిలిపించిందన్నారు. బయట ఊరిలో కాపురానికి ఒప్పుకొని నవాజ్‌పై అతని బామర్థి హనూర్ చాతీపై కత్తితో పొడిచినట్లు చెప్పారు. బాధితుడిని చికిత్స తిరుపతికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

ఓబులవారిపల్లె ఆగస్టు 11 : ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని రైతులకు ఎంసీఏ బులయ్య సూచించారు. అదే విధంగా నాటు ఆవున పెంచుకోవడం వల్ల వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. పంటలకు జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసుకుని వాడటం వల్ల తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని, దీనివల్ల భూమి గుల్లబారి వానపాములు కూడా ఉత్పత్తి చెందుతాయన్నారు. ఈ ప్రకృతి వ్యవసాయం వల్ల క్రిమి సంహారక మందులు వాడకం తగ్గి ఆరోగ్యంగా ఉంటారని ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయం చేయడానికి ముందుకు రావాలని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సూచనలు ఇవ్వడానికి సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి



అధికారులకు, విద్యాసంస్థల నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, ఆగస్టు 11: మదనపల్లె పట్టణంలో ఈనెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్న ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా డీఎస్పీ కొండయ్యానాయుడుకు సూచించారు. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమవారం ఉదయం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు(ఇంటర్, డిగ్రీ) విద్యార్థులందరిని స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సమీకరించి అక్కడి నుంచి దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ ర్యాలీ స్థానిక అంబేడ్కర్ సర్కిల్ మీదుగా అనిబిసెంట్ సర్కిల్ వద్దకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్కడ కూడా ట్రాఫిక్ జామ్ కాకుండా ట్రాఫిక్‌ను మళ్లించాలన్నారు. ప్రజలు కూడాపెద్దసంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంఈవో ప్రభాకరరెడ్డి, ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు ఆర్.గురుప్రసాద్, ఎన్. సేతు, రఘునాథరెడ్డి, శ్రీనివాసులు, పట్టణ ప్రముఖులు మార్పురి శశిధర్‌రావు, మార్పురి వరుణ్, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, మాకం అశోక్, టీడీపీ నాయకులు విద్యాసాగర్, నాదెళ్ల శివన్న, షంషీర్, నాగూర్‌వలి, బాబాఫకృద్దీన్, చిన్నమహేష్, జేవీ రమణ, రాయచోటి శశి, సహదేవనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తట్టివారిపల్లె సమీపంలోని ఆక్రమణలను అడ్డుకోండి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11: మండలంలోని బసినికొండ పంచాయతీ, తట్టివారిపల్లె సమీపంలోని ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలను వైసీపీ నాయకులు ఆక్రమించి భవంతులు నిర్మించారని వాటిని అడ్డుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కోరారు. ఆమేరకు ఆదివారం వారు ఎమ్మెల్యేను కలిసి అక్రమాలను అరికట్టాలంటూ వినతిపత్రాలు అందజేశారు. ఇందులో బసినికొండ గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు1050లో 2ఎకరాల56 సెంట్లు ఉంది. ఇందులో 0.20 సెంట్లు రెవెన్యూ శాఖ వారు డీఆర్‌డీఏ ద్వారా సిరికల్చర్ సిల్క్ రీలింగ్ షేడ్‌కు లీజ్ అగ్రిమెంట్ చేసుకున్నారని అయితే తరువాత సిల్క్ రీలింగ్ ఆపేశారన్నారు. లింగిశెట్టి చెరువుకు నీళ్ల వెళ్లడానికి 30 అడుగుల వెడల్పు కలిగిన కాలువను పూడ్చి అక్రమంగా బహుళ అంతస్థుల భవణాలను నిరించారని వారు పేర్కొన్నారు. ఈ ఆక్రమణలపై ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖావారికి విన్నవించిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన లేకుంటే కఠిన చర్యలు తప్పవు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ కొండయ్య నాయుడు

మదనపల్లె టౌన్, ఆగస్టు 11: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుంటే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ డి.కొండయ్య నాయుడు హెచ్చరించారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కాని, మండలంలో కాని ఎక్కడ గొడవలు జరిగినా, ముందస్తుగా రౌడీలపైనే దృష్టి పెడతామన్నారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడు పోలీసుల నిఘా వుం టుందని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే జైలుకు వెళ్లక తప్పదన్నారు. రాత్రి 10గంటల తరువాత రౌడీషీటర్లు వీధుల్లో తిరిగినా, అనుమానాస్పదంగా తిరిగినా వారిని విచారించి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఈ కౌన్సెలింగ్‌లో ఓ మహిళా రౌడీషీటర్ కూడా ఉండటం గమనార్హం. మదనపల్లె వన్‌టౌన్, టు టౌన్, తాలూకా పోలీసు స్టేషన్ల పరిధిలోని 36 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో మదనపల్లె వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా, తాలూకా సీఐ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

భవననిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి సాంబశివ

బి.కొత్తకోట, ఆగస్టు11: రాష్ట్రంలో రద్దుచేసిన భవననిర్మాణరంగ కార్మిక సంక్షేమబోర్డును పునరుద్ధరించి, నిర్మాణరంగ కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి సాంబశివ, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి సలీంబాషాలు డిమాండ్ చేశారు. బి.కొత్తకోట పట్టణంలోని కార్యాలయంలో ఆదివారం జరిగిన తాపీ మేస్త్రీలు, కూలీల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ 2006లో ప్రారంభమైన సంక్షేమబోర్డును 2019 తర్వాత గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. భవననిర్మాణాలకు ఇసుక ఉచితంగా సరఫరా అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రఘునాథ్, మురళి, రామాంజులు, రఫీ, సురేష్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

కలకడలో నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్



కలకడ, ఆగస్టు 11:కలకడ గ్రామ పంచాయతీ ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ నిరుపయోగకరంగా మారింది. ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలనే లక్ష్యంతో సుమారు ఎనిమిదేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంలో వారపు సంత ప్రాంగణం వద్ద ఏర్పాటు చేశారు. ఇందు కోసం సమీపంలోని బోరు నుంచి పైప్‌లైన్ వేసి 5 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్‌ను అమర్చారు. దీని నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించారు. అక్కడ పని చేసేందుకు మనిషిని నియ మించి కుటుంబానికి ఒక క్యాన్ వంతున ఉచితంగానే నీటిని అందజేశారు. అయితే 2022 సంవత్సరం నుంచి ప్లాంట్‌ను మూసేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. దీంతో ప్రజలు ప్రైవేట్ వారి నుంచి క్యాన్‌ను రూ.15కు కొనుగోలు చేస్తున్నారు. ఇకనైన గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి దేవేంద్రను వివరణ కోరగా బోరు మోటరు రిపేరు కారణంగా ప్లాంట్ మూతపడిందన్నారు. త్వరలో మరమ్మతులు చేయించి ప్రజలకు తాగునీటిని అందజేస్తామని తెలిపారు.

డాక్టర్ స్వాతి చక్రపాణికి మహిళా సేవా వైభవరత్న అవార్డు



వైభవరత్న అవార్డు అందుకున్న స్వాతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు11: మదనపల్లెకు చెందిన డాక్టర్ శంకరాపు స్వాతి చక్రపాణికి మహిళా సేవా వైభవరత్న అవార్డును శనివారం తెలంగాణ రాష్ట్రంలో సికింద్రాబాదులో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవార్డుతో సేవా రంగంలో తనకు మరింత బాధ్యత పెంచిందన్నారు. లలిత కళా సమాఖ్య సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ వారు 9 రాష్ట్రాలలోని సేవా, సామాజిక, సాంస్కృతిక రంగాల వారిని గుర్తించి హరిహర కళాభవన్‌లో ఆయా రంగాల్లో ప్రావీణ్యం సాధించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో మదనపల్లెకు చెందని డాక్టర్ స్వాతి చక్రపాణి ధాత్రీ ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా రంగంలో సేవలను అందించినందుకు గాను మహిళా సేవా వైభవరత్న అవార్డును శ్రీకృష్ణ సేవా సంస్థాన్ అధ్యక్షుడు శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి అందజేశారు. కార్యక్రమంలో బుల్లితెర నటుడు అల్లం అనిల్, హోమియో వైభవ ప్రవీణ డాక్టర్ వారణాశి మధు, లలిత కళా సంస్థ అధ్యక్షుడు మహేంద్రవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ

కలికిరి, ఆగస్టు 11: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు సోమవారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పీవీ పరశురామ్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ వుంటుందని చెప్పారు. గ్రామ పంచాయతీల్లోని వివిధ రకాల విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, చెత్త సేకరణ, వర్మికంపోస్ట్ తయారీ, పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికల తయారీ, ఆర్థిక వనరుల సమీకరణ తదితర అంశాలపై బుధవారం వరకూ ఈ శిక్షణ తరగుతులుంటాయన్నారు. మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావాలని పరశురామ్ కోరారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

గుర్రంకొండ, ఆగస్టు 11:గుర్రంకొండ పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో దృష్టి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరానికి 125 మంది రోగులు హాజరయ్యారు. వారందరికీ వైద్య పరీక్షలు చేసి 80 మందిని కంటి ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. మిగిలిన రోగులకు మందులు, మాత్రలను ఇచ్చారు. కార్యక్రమంలో రిడో సంస్థ కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.